





దిగ్గజాలు దిగివచ్చారు. ధార్మికవేత్తలు ఏతెంచారు. సంప్రదాయ వాయిద్యాలు హోరెత్తాయి. వేడుకగా అంతర్జాతీయ ఆలయాల సదస్సు ఉత్సవంలా మొదలైంది. ఇంటర్నేషనల్ టెంపుల్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో- 2025 సందడితో తిరుపతి కళకళలాడింది. సోమవారం సాయంత్రం ప్రారంభ వేడుకకు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గోవా ముఖ్యమంత్రులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆరెస్సెస్ ప్రముఖులు, దేశంలోని ప్రసిద్ధ ఆలయాల నిర్వాహకులు, వివిధ రాష్ట్రాల అధికారులు పాల్గొన్నారు. ఆశా కన్వెన్షన్‌లో మరో రెండు రోజుల పాటూ ఈ సదస్సులు కొనసాగుతాయి. సదస్సుకు అనుబంధంగా జరుగుతున్న ఆలయాల భద్రత, నిర్వహణకు ఉపకరించే పరికరాలు, భారతీయ సంప్రదాయ వస్త్ర, చిత్రాల ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది.





ఆలయోత్సవం

తిరుపతిలో వేడుకగా ప్రారంభం

ముగ్గురు సీఎంలు, ఐదుగురు మంత్రులు, ఆర్ఎస్ఎస్ ముఖ్యులు, వీహెచ్‌పీ ప్రముఖులు,ఆధ్యాత్మిక వక్తలు,ఆలయ ట్రస్టీలు, అధికారులు, నిపుణులు.. ఒక చోట కలిశారు. ఇంతమంది ప్రముఖులు హాజరవుతున్న సదస్సు గురించి ఒక రోజు ముందుగానే జిల్లావాసులకు తెలిసింది.ఇంటర్నేషనల్ టెంపుల్స్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో (ఐటీసీఎక్స్-2025)పేరిట టెంపుల్ కనెక్ట్ సంస్థ నిర్వహించిన అంతర్జాతీయ ఆలయోత్సవానికి తిరుపతిలోని ఆశా కన్వెన్షన్ వేదికైంది. అంతమంది ప్రముఖులు హాజరయ్యే చోటకు వెళ్లాలని పలువురు ఆసక్తి చూపినప్పటికీ భద్రతాకారణాల నేపథ్యంలో అనుమతి దొరకలేదు.సోమవారం నాటి ప్రారంభ సభకు ముందు అతిథులకు స్వాగతం పలుకుతూ ముంబై నుంచి వచ్చిన సంప్రదాయ కళాకారుల ఆధ్యాత్మిక సంగీత విన్యాసాలు ఓ పవిత్ర వాతావరణంలోకి తీసుకెళ్లాయి. ఒక హాల్లో సభ, మరో హాల్లో వివిధ స్టాళ్లను ఏర్పాటుచేశారు. ఆలయ పరిశుభ్రత, భద్రత, ఆచార వ్యవహారాలకు సంబంధించిన వస్తువులను తయారుచేసే కంపెనీలు ఈ స్టాళ్లలో కనిపించాయి. 17 దేశాల్లోని 1581 దేవాలయాల నుంచి ప్రతినిధులు సదస్సులో భాగస్వామ్యం కానున్నట్టు నిర్వాహకులు చెప్పారు. అయితే 58 దేశాల నుంచి అదనంగా 685 దేవాలయాల ప్రతినిధులు హైబ్రిడ్ ఫార్మాట్‌లో పాల్గొంటారని చెప్పారు.11మందికి పైగా వక్తలు, 15 వర్క్‌షాప్‌లు, 60 ఎగ్జిబిషన్ స్టాల్స్ అంతర్జాతీయ దేవాలయాల సమావేశంలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

శ్రీ వేంకటేశ్వర ఆలయానికి నిలయంగా ఉన్న తిరుపతి ఏటా లక్షలాది మంది భక్తులను ఆకర్షిస్తోందని, ఇది ప్రపంచవ్యాప్తంగా అత్యంత రద్దీగా ఉండే మతపరమైన ప్రదేశాలలో ఒకటిగా మారుతోందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

అందరి నోటా శ్రీవారి ప్రశస్తి

తిరుపతి, తిరుమల ప్రశస్తి, శ్రీవారి వైభవం ఎవరికీ తెలియంది కాదు. తరతరాలుగా తిరుమల, తిరుపతి పుణ్యక్షేత్రాలను, శ్రీవారిని ఎందరో రాజులు, చక్రవర్తులు దర్శించడం, శ్లాఘించడం, విలువైన కానుకలు సమర్పించడమూ కొత్త కాదు. అయినా నేటికీ తిరుపతి వేదికగా ఏ కార్యక్రమం జరిగినా, ఏ ప్రముఖులు పాల్గొని ప్రసంగించినా అందులో తిరుపతి పుణ్యక్షేత్ర ప్రస్తావన, శ్రీవారి వైభవాన్ని ప్రస్తుతించకపోవడమనేది ఉండదంటే అతిశయోక్తి కాదు. సోమవారం సాయంత్రం తిరుపతిలో ప్రారంభమైన ఐటీసీఎక్స్-2025 సదస్సులోనూ అదే ప్రతిబింబించింది. పలువురు వక్తల నోట తిరుపతి పుణ్యక్షేత్రం, తిరుమల శ్రీవారి ప్రశస్తి పలుమార్లు ప్రస్తావనకు వచ్చింది. ఐటీసీఎక్స్ సదస్సుకు తిరుపతి వేదిక కావడం, అందులో పాల్గొనడం తమ అదృష్టమన్న మాటలతోనే ముగ్గురు సీఎంలూ ప్రసంగాలు ప్రారంభించారు.




దేవుడిని పూజించే ప్రతి భక్తుడికీ సహజ సిద్ధమైన గమ్యస్థానంగా తిరుపతి ఆవిర్భవించింది. తిరుమలలో భక్తులకు అన్న ప్రసాదాలు అందించాలనే ఉద్దేశంతో 1985-86లో అప్పటి సీఎం ఎన్టీఆర్ శ్రీవారి అన్నదాన ట్రస్టు ఏర్పాటు చేశారు. ఇపుడా ట్రస్టుకు విరాళాల రూపంలో రూ.3 వేల కోట్ల కార్పస్ ఫండ్ చేరింది. దీనిపై వచ్చే వడ్డీతో తిరుమల, తిరుపతిల్లో టీటీడీ భక్తులకు అన్నప్రసాదాల వితరణ చేస్తోంది. నేను సీఎంగా గతంలో ప్రారంభించిన శ్రీవారి ప్రాణదాన ట్రస్టుకు ఇపుడు రూ.440 కోట్లు వచ్చాయి. ఆ నిధులతో టీటీడీ ఎందరికో ప్రాణదానం చేస్తోంది. అన్ని రాష్ట్రాల రాజధానుల్లోనూ.. హిందువులున్న ప్రతిదేశంలోనూ శ్రీవారి ఆలయాలు ఉండాలి. తిరుమలలో 75 శాతం గ్రీన్ కవర్ ఉంది. అక్కడ పర్యావరణాన్ని కాపాడేందుకు మరింత పెద్దఎత్తున చర్యలు తీసుకుంటాం. తిరుపతిలో ఐటీసీఎక్స్ నిర్వహిస్తున్న రెండో సదస్సుకు వచ్చిన ముఖ్యులకు శ్రీవారి దర్శనం కల్పించాలని టీటీడీ ఈవోకు చెబుతున్నా.

- ఏపీ సీఎం చంద్రబాబు



58 దేశాల నుంచీ 1500 ఆలయాల నిర్వహణా కమిటీలు పావన నగరమైన తిరుపతిలో సదస్సు చేపట్టడం అద్భుతం. దీనికి నన్ను ఆహ్వానించడం, శ్రీవారి దర్శనం చేసుకుని సదస్సులో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నా. దేశంలో ఆలయ నిర్వహణ అద్భుతంగా అమలవుతున్నది తిరుమల, తిరుపతి దేవస్థానాలలోనే. తిరుపతి, తిరుమల, శ్రీకాళహస్తి, నాగలాపురం వంటి చోట్ల ఆలయాల నిర్మాణానికి, అభివృద్ధికి శక్తిమేరా విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు పాటుపడ్డారు. దక్షిణ భారతాన అద్భుత ఆలయాలు కట్టించారు.

- మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్



ప్రయాగరాజ్‌లో మహాకుంభ్ జరుగుతుంటే.. తిరుపతిలో ఆలయాల కుంభ్ మేళా జరుగుతోంది. ఇందులో పాల్గొనడం అదృష్టంగానే కాక గర్వంగా భావిస్తున్నా.

- గోవా సీఎం ప్రమోద్ సావంత్

ముగ్గురు సీఎంల పర్యటన ప్రశాంతం



తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం చంద్రబాబు, మహారాష్ట్ర, గోవా ముఖ్యమంత్రులు దేవేంద్ర ఫడ్నవీస్, ప్రమోద్‌సావంత్ తదితర ప్రముఖుల తిరుపతి పర్యటన ప్రశాంతంగా సాగింది.ఆశా కన్వెన్షన్ హాలు వద్ద పోలీసులు భారీ భద్రతా చర్యలు చేపట్టారు. వేదిక చుట్టూ పారా మిలటరీ బలగాలను నియమించారు. మంగళం- తిరుపతి రహదారిలో వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు. ఎస్పీ హర్షవర్ధనరాజు నేతృత్వంలో ముగ్గురు అదనపు ఎస్పీలు, 10 మంది డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, దాదాపు 800 మంది పోలీసులు భద్రతా విధుల్లో పాల్గొన్నారు. సభాస్థలికి వెళ్లే ప్రతి ఒక్కరినీ తనిఖీ చేసి అనుమతించారు. బాంబు డిస్పోజల్, డాగ్ స్క్వాడ్‌లు అడుగడుగునా తనిఖీలు చేశాయి. రోడ్డులో వెళుతున్న కొందరు అనుమానితులను ముందస్తుగా తనిఖీలు చేసి అదుపులోకి తీసుకుని వదిలి పెట్టారు.

సదస్సులో నేడు..

విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ప్రధాన కార్యదర్శి మిలింద్ పరాండే, తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై, సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ మాజీ ఛైర్మన్ సురేష్ హవారే, గోవా పర్యాటక మంత్రి రోహన్, ఇస్కాన్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ గోవింద దాస్ తదితరులు పలు అంశాలపై జరిగే చర్చల్లో పాల్గొననున్నారు.

కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

చంద్రగిరి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు సోమవారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. అంకురార్పణలో భాగంగా నవధాన్యాలను నవపాలికల్లో నింపారు. 49 మంది దేవతలను ఆహ్వానిస్తూ వేద మంత్రోచ్చారణతో ఆగమోక్తంగా పూజలు చేశారు. మంగళవారం ఉదయం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 7.30 నుంచి 8 గంటల వరకు స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు తిరుచ్చి ఉత్సవం నిర్వహించనున్నారు. 8.15 నుంచి 8.40 గంటల మధ్య మీనలగ్నం నందు ధ్వజారోహణ ఘట్టాన్ని నిర్వహించనున్నారు. సాయంత్రం ఊంజల్ సేవ, రాత్రి 8 పెద్దశేష వాహన సేవ జరుగుతాయి. అంకరార్పణ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, కంకణ భట్టర్ శేషాచార్యులు, అర్చకులు బాలాజీ రంగాచార్యులు, పార్థసారథి, నారాయణచార్యులు, సూపరింటెండెంట్లు రాజ్‌కుమార్, రమేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు మునికుమార్, ధనుశేఖర్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





క్రమశిక్షణ లేకుండా దూసుకెళుతున్న సెక్యూరిటీ

అయినా.. తీరు మారలేదు

● అస్తవ్యస్తంగా ముక్కంటి ఆలయ సెక్యూరిటీ వ్యవస్థ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని సెక్యూరిటీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. తరచూ కొందరు సిబ్బంది పనితీరు విమర్శలకు తావిస్తోంది. వీరివల్ల అప్రతిష్ఠా వస్తోంది. గత వైసీపీ హయాంలో పాలకులు, అధికారులు కలిసి స్వలాభం కోసం వ్యవస్థను గందరగోళంగా మార్చేశారు. అవినీతిమయం చేశారు. రెండేళ్ల కిందట అప్పటి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిపై ఓ సెక్యూరిటీ విభాగం ఇన్‌ఛార్జి బాహాటంగా విమర్శలు చేశారు. ప్రతిరోజు తక్కువ సిబ్బందికి విధులు కేటాయిస్తూ జీతాల బిల్లుల సమయంలో ఎక్కువ నమోదు చేస్తూ ప్రతి నెలా రూ.10లక్షలు స్వాహా చేశారని అప్పట్లో ఆధారాల సహా ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చినా.. కొందరి తీరు మారలేదు. సెక్యూరిటీ సిబ్బంది నిర్లక్ష్యం వీడలేదు. పాత పంథానే కొనసాగిస్తున్నారు. సెక్యూరిటీ వ్యవస్థను గాడిన పెట్టేదిశగా అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

వైసీపీ అధికారంలోకి వచ్చాక..

● 2019 వరకు ప్రైవేటు సంస్థలు సెక్యూరిటీ కాంట్రాక్టు దక్కించుకున్నప్పటికీ.. పర్యవేక్షణకు డీఎస్పీస్థాయి విశ్రాంత అధికారిని చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా ఆలయం తరఫున నియమించేవారు. 2019 వరకు విశ్రాంత డీఎస్పీ కృష్ణమూర్తి సీఎస్‌వోగా పనిచేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆలయ సూపరింటెండెంట్లకే పర్యవేక్షణ బాధ్యత అప్పగించారు.

ఇప్పుడూ అదే నిర్లక్ష్యం

కూటమి అధికారంలోకి వచ్చినా సెక్యూరిటీ సిబ్బంది మాత్రం గత నిర్లక్ష్యం, నిబంధనల ఉల్లంఘనను కొనసాగిస్తూనే ఉన్నరు. రెండు నెలల కిందట ఐదుగురు సెక్యూరిటీ సిబ్బంది సెల్‌ఫోన్‌లో రీల్స్ చూస్తుండగా ఈవో బాపిరెడ్డి పట్టుకుని విధుల నుంచి తొలగించారు. చేతివాటం ప్రదర్శిస్తున్న సూపర్‌వైజర్లు శీనయ్య, చంద్ర, శ్యామ్‌నూ విధుల నుంచి తొలగించగా.. ఆ తర్వాత రాజకీయ ఒత్తిడితో వీరు యథావిధిగా విధుల్లో చేరారు. మరో సెక్యూరిటీ సూపర్‌వైజర్ షణ్ముగం గతంలో భరద్వాజ తీర్థంలో మద్యం తాగుతూ పట్టుబడినట్లు, త్రినేత్ర అతిథి గృహంలోని డార్మిటరీలో విందు భోజనాలు చేస్తూ అధికారులకు చిక్కినట్లు గుర్తించిన ఈవో.. ఇకపై తీరు మార్చుకోవాలని 20 రోజుల కిందట మందలించారు.

ముఖ హాజరుతో అవినీతికి చెక్

సెక్యూరిటీ విభాగంలో ముఖ హాజరుతో అవినీతిని అరికట్టవచ్చని అధికారులు భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వంలోని అన్ని శాఖల్లో గత ప్రభుత్వంలోనే ముఖ హాజరు విధానం తీసుకొచ్చారు. కానీ ముక్కంటి ఆలయంలో సెక్యూరిటీ, శానిటరీ సిబ్బందికి మాత్రం దీనిని అమలు చేయలేదు. ముఖహాజరు వల్ల ఎక్కువ మందిని చూపే అవకాశం ఉండదని గత పాలకులు దీనిని అమలు చేయలేదన్న విమర్శలున్నాయి. ఇప్పుడు అమలు చేసే విషయమై అధికారులు యోచిస్తున్నారు.

● సెక్యూరిటీ గార్డులను నియమించే సమయంలో వారిపై ఎలాంటి కేసులు, నేరాల్లో భాగస్వాములు కాలేదన్న ధ్రువీకరణ తీసుకోవాలి. కానీ గత ప్రభుత్వంలో కేసులున్న కొందరిని నియమించుకున్నారు.

● మూడు షిఫ్టులలో విధులు నిర్వహించే సెక్యూరిటీగార్డుల వివరాలను ఎప్పటికప్పుడు నోటీసు బోర్డులో ఉంచాలి. కానీ, రాతపూర్వకంగా సెక్యూరిటీ హాజరు పుస్తకాలను నమోదు చేసేవారు. తద్వారా ఎక్కువ మంది పనిచేసినట్లు బిల్లులు పెడుతూ సొమ్ము చేసుకునేవారని గతంలో విమర్శలు వెల్లువెత్తాయి. ఇలా ఎన్నో నిబంధనలను గాలికొదిలేశారు.



అక్రమార్జనే ప్రధానంగా..!

వైసీపీ హయాంలో షిఫ్టులవారీగా డ్యూటీలు కేటాయించే సూపర్‌వైజర్లు తమకు ఇష్టమైన వారిని ఆదాయం వచ్చే చోట్ల నియమించుకునేవారు. ఆ సొమ్మును పంచుకునేవారు.ఇక,ఐదేళ్ల వైసీపీ పాలనలో చాలాసార్లు సెక్యూరిటీ గార్డులు,సూపర్‌వైజర్లు దళారీ అవతారం ఎత్తి అధికారులకు పట్టుబడటం..కొందరిపై వేటు పడిన సందర్భాలూ ఉన్నాయి.నిబంధనల ప్రకారం ఆరుగురు సూపర్‌వైజర్లు ఉండాలి.కానీ, 12మందిని అప్పట్లో నియమించుకున్నారు.సూపర్‌వైజర్ల తీరుపై చాలా కాలంగా ఆరోపణలు వస్తున్నా.. అధికారులు కనీస చర్యలు తీసుకోలేదు.ఏడాది కిందట ఓ సూపర్‌వైజర్ భరద్వాజ తీర్థంలోబహిరంగంగా మద్యం తాగుతూ అధికారులకు పట్టుబడిన వైసీపీ నేతల అండ ఉండటంతో అతడిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

సెక్యూరిటీ తీరుపై భక్తుల ఆవేదన

విధులకు హాజరయ్యే సమయంలో సెక్యూరిటీ సిబ్బంది దురుసుగా దూసుకెళ్లడంపై భక్తులు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజుల కిందట మధ్యాహ్నం విధులకు హాజరయ్యే సమయంలో కొందరు సిబ్బంది తమ విభాగం కార్యాలయంలోకి ఒకసారిగా దూసుకెళ్లడంపై భక్తులు ఆశ్చర్యానికి గురయ్యారు. భక్తుల్లో అక్కడ ఏం జరిగిందోనన్న ఆందోళన కలిగింది. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.

ఎన్‌ఎఆర్‌ఎల్‌లో ముగిసిన స్వచ్ఛత పక్షోత్సవాలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో అధికారులు

పాకాల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గాదంకి ఎన్‌ఎఆర్‌ఎల్ ఆధ్వర్యంలో 15 రోజుల పాటు జరిగిన స్వచ్ఛతా పక్షోత్సవాలు సోమవారం ముగిశాయి. పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ వినియోగంతో అనర్థాలు గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన, క్విజ్ పోటీలు నిర్వహించారు. పరిసర గ్రామాలను సందర్శించి జనపనార సంచులను పంపిణీ చేశారు. ఉద్యోగులు, పరిశోధన విద్యార్థులు గాదంకి హైస్కూల్‌లో నాటక ప్రదర్శన నిర్వహించారు. డాక్టర్ లోమ్టె ద్వారా ఆహార అలవాట్లపై అవగాహన కల్పించారు. బుల్లితెర నటుడు బాబీ ముగింపు వేడుకల్లో పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. పి.రవిప్రసాద్, ఎం.శ్రీనివాసగుప్త, బి.మల్లికామాధురి, జి.హరివెంకటకుమార్, కెవి.సిజి పాల్గొన్నారు.

దౌర్జన్యానికి పాల్పడిన అధికారిపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న అఖిలపక్ష నాయకులు

పాకాల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కుక్కలపల్లె దళితవాడ సమీపంలో దళితుల భూముల్లో అక్రమంగా ప్రవేశించి దౌర్జన్యాలకు పాల్పడుతున్న రైల్వే పోలీసు అధికారిపై చర్యలు తీసుకోవాలని అఖిల పక్ష నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం విశ్రాంత జిల్లా జడ్జి గుర్రప్ప ఆధ్వర్యంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కందారపు మురళి, రిపబ్లికన్ పార్టీ దక్షిణ భారత అధ్యక్షుడు పి.అంజయ్య, బీఎస్పీ నాయకులు గ్రామసమీపంలోని భూములను సందర్శించారు. వీరు మాట్లాడుతూ అధికారి ఆశీర్వాదం కుటుంబ సభ్యులు, కొంతమంది రౌడీలతో కలిసి దళితులను బెదిరిస్తున్నారని ఆరోపించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అధికారులు చర్యలు తీసుకోకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

విశిష్ట గుర్తింపు కార్డుకు వివరాల నమోదు

రామచంద్రాపురం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం రైతులందరూ తమ వివరాలను రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని మండల డీటీ అన్వర్ బాషా సూచించారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలు, వ్యవసాయశాఖసిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదుపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి స్రవంతి, ఆర్ఐ లక్ష్మీనారాయణ, సర్వేయర్ రమేష్‌బాబు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ రక్షిత శానిటరీ ప్యాడ్స్ పంపిణీ

పాకాల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పర్యావరణ రక్షిత శానిటరీ ప్యాడ్స్ పంపిణీ చేశారు. సత్యం చారిటబుల్ ఫౌండేషన్ సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.లయన్స్ క్లబ్ జోన్ చైర్ పర్సన్ మారసాని విజయబాబు మాట్లాడుతూ పర్యావరణ రక్షిత శానిటరీ ప్యాడ్స్ వినియోగించాలన్నారు. ఉమెన్ ఫర్ ఉమెన్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు రమ్యసుధ, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అనిల్ కుమార్, మారసాని గౌరీ, ఎం.నాగేంద్ర, ప్రధానోపాధ్యాయుడు మహమ్మద్ రఫీ, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం జయచంద్ర, ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మీ, కిశోర్ పాల్గొన్నారు.

ఏడాదిన్నరలో 500 గుండె బైపాస్ శస్త్ర చికిత్సలు



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు

తిరుచానూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రిలో ఏడాదిన్నలో 500 గుండె బైపాస్ సర్జరీలు విజయవంతంగా పూర్తి చేసినట్లు సీటీవీఎస్ శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ పి.త్రిలోక్ తెలిపారు. ఆస్టర్ నారాయణాద్రిలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లిష్టమైన కేసులను కూడా 99.9శాతం సక్సెస్ రేట్‌తో పూర్తి చేశామన్నారు. ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ సునందకుమార్‌రెడ్డి మాట్లాడుతూ అరుదైన వైద్య సేవలందించడంలో తమ ఆస్పత్రి ముందుంటుందన్నారు. అపార అనుభవమున్న నిపుణుల బృందం ఇందుకు కారణమన్నారు. చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్‌ముని మాట్లాడుతూ ఏడాదిన్నరలో ఇన్ని గుండె బైపాస్ సర్జరీలు విజయవంతంగా పూర్తి చేయడం రాయలసీమలోనే ప్రథమం కావడం గర్వకారణంగా ఉందన్నారు. ఇక్కడ సీటీవీఎస్ సర్జరీలు ప్రారంభించక ముందు చెన్నై, బెంగళూరు వంటి నగరాలకు వెళ్లి వ్యయప్రయాసలు పడేవారన్నారు. ఆస్టర్ నారాయణాద్రిలో సీటీవీఎస్ సర్జరీలు ఆరోగ్యశ్రీ, స్కీంలతో ఉచితంగా చేస్తున్నామని చెప్పారు. సమావేశంలో డైరెక్టర్ డాక్టర్ ఎస్వీ ప్రసాద్, వైద్యులు ప్రతి,సుమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

అంగన్వాడీల వేతనాలు పెంచకపోతే అసెంబ్లీ ముట్టడి

● సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి



ధర్నాలో మాట్లాడుతున్న ధనలక్ష్మి

చంద్రగిరి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ సిబ్బంది వేతనాలు పెంచకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి హెచ్చరించారు. సోమవారం చంద్రగిరిలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ వైసీపీ హయాంలో అంగన్వాడీ వర్కర్లను పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వంలో కూడా తమ సమస్యలపై స్పందించడంలేదన్నారు. అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించి వేతనాలు పెంచాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జయచంద్ర, ప్రియదర్శిని, నాగభూషణమ్మ, వాణిశ్రీ, అమర, నవనీత, పద్మప్రియ, ఉషారాణి, మంజుల పాల్గొన్నారు.

సహజ ఆహారం తీసుకుంటే క్యాన్సరు దూరం



మాట్లాడుతున్న డాక్టర్ రాఘవ శ్రీరామనేని

రామచంద్రాపురం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ సమస్యను సరైన సమయంలో గుర్తించి తగిన చికిత్స తీసుకుంటే ఎలాంటి ఇబ్బంది ఉండదని సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రాఘవ శ్రీరామనేని అన్నారు. వెంకట్రామపురం సమీపంలోని సెవెన్‌హిల్స్ ఫార్మసీ కళాశాలలో సోమవారం క్యాన్సర్ చికిత్సపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి అమెరికాలోని సెటోమ్ థెరప్యూటిక్స్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రాఘవ శ్రీరామనేని హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆయన మాట్లాడుతూ సహజ ఆహారం తీసుకుంటే క్యాన్సర్ దరిచేరదన్నారు. ప్రోబాడీ టెక్నాలజీ ద్వారా క్యాన్సర్ నివారణ సులభతరమన్నారు. ప్రిన్సిపాల్ నిరంజన్‌బాబు మాట్లాడుతూ సరైన చికిత్స తీసుకుంటే క్యాన్సర్ రోగుల ప్రాణాలను కాపాడ వచ్చన్నారు. కార్యక్రమలో కళాశాల బోధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలకు సిద్ధార్థ విద్యార్థుల ఎంపిక



ఎంపికైన వారితో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

తిరుపతి రూరల్, ఫిబ్రవరి17 (ఆంధ్రజ్యోతి): సి.గొల్లపల్లెలోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో చెన్నైకి చెందిన టీవీఎస్ బ్రేక్స్ ఇండియా సంస్థ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఫైనలియర్ కోర్సులు చదివే 54మంది విద్యార్థులు పలు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్ పేర్కొన్నారు. వీరికి ఉద్యోగ నియామకపత్రాలు అందజేశారన్నారు. విద్యార్థులను చైర్మన్ వై.కొండారెడ్డి, సెక్రటరీ వై.ఆనందరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ వై.విజయ్‌రెడ్డి, ప్లేస్‌మెంట్స్ డైరెక్టర్ స్వామినాథ్, హెడ్లు, అధ్యాపకులు అభినందించారు.

అమ్మవారి సేవలో మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్



తిరుచానూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారిని సోమారం మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ దర్శించుకున్నారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్ ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. మూలవర్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేదపండితులు ఆయనను ఆశీర్వదించి అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. పద్మావతి అమ్మవారిని కేంద్రమంత్రి శ్రీపాదనాయక్ కూడా దర్శించుకున్నారు. టీటీడీ పాలకమండలి సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, సౌరభ్ హెచ్ బోరా, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో వాల్మీకేశ్వరస్వామి

తిరుపతి రూరల్, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): దుర్గసముద్రంలోని వాల్మీకేశ్వర శర్వాణి సమేత శివాలయంలో సోమవారం స్వామివారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ ధర్మకర్త ఆదెం శంకరానందరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆరేళ్లలోపు పిల్లలకు నేటినుంచి ఆధార్ నమోదు

తిరుపతి రూరల్, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): మండలం గ్రామ సచివాలయాల పరిధిలో మంగళవారం నుంచి ఈనెల21 వరకు ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రామచంద్ర పేర్కొన్నారు. సచివాలయాల్లో 0-6ఏళ్ల పిల్లలకు ఆధార్‌కార్డు నమోదు, 5-15ఏళ్ల పిల్లలకు ఆధార్ బయోమెట్రిక్ నమోదు కేంద్రాలనఱ ఏర్పాటు చేశామన్నారు. అవిలాల సచివాలయ పరిధిలో అవిలాల, ఆంధ్రాబ్యాంక్‌కాలనీ, ధనలక్ష్మీనగర్, సాయినగర్-1,2, లింగేశ్వరనగర్, పద్మావతిపురం, చిగురువాడ, దుర్గసముద్రం, మల్లంగుంట, తిరుచానూరు సెక్రటేరియట్‌లో తిరుచానూరు, యోగిమల్లవరం, చైతన్యపురం, లక్ష్మీనగర్‌కాలనీ, దామినేడు, పాడిపేట, బ్రాహ్మణపట్టు, తనపల్లె, ఓటేరు, వేదాంతపురం, చెర్లోపల్లె సచివాలయంలో చెర్లోపల్లె, వెంకటపతినగర్, పుదిపట్ల, పేరూరు, హరిపురంకాలనీ, విద్యానగర్, తుమ్మలగుంట, గొల్లపల్లె, సి.మల్లవరం, పెరుమాళ్లపల్లె, ఎస్వీనగర్ ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ



మహిళకు పర్సు అందజేస్తున్న ఏఎస్పీ తదితరులు

వరదయ్యపాళెం, ఫిబ్ర వరి 17(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ తన నిజాయితీని చాటుకున్నాడు. వరదయ్యపాళెం మండలానికి చెందిన మీర్జాన్‌బాషా ఆటో నడుపు కుంటూ జీవనం సాగిస్తు న్నాడు. పని నిమిత్తం తిరు పతికి వెళ్లాడు. ఈ క్రమం లో విమల అనే మహిళ సోమవారం తిరుపతి బస్టాం డు నుంచి ఆటో ఎక్కి రామ చంద్రాపురంలో దిగింది. అయితే ఆ మహిళ తన పర్సును ఆటోలో మరచి వెళ్లిపోయింది. పర్సులో రూ.8,500 ఉన్నట్లు గుర్తించాడు. ఈ విషయాన్ని ఆర్‌సీపురం పోలీసులకు తెలిపా డు. అందులోని ఆధార్‌కార్డులో వివరాల మేరకు మహిళ భర్తకు ఫోన్ చేశారు. అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి మహిళకు పర్సును అందజేశారు. మీర్జాన్‌బాషాను అభినందించారు.

రేషన్ బియ్యం స్వాధీనం



నాగలాపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): నాగలాపురం తూర్పు దళితవాడలో 220 బస్తాల రేషన్ బియ్యాన్ని ఎస్పీ పోలీసు ప్రత్యేక బృందం స్వాధీనం చేసుకుంది. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు ఎస్బీ అధికారి దాము ఆధ్వర్యంలో బృందం అక్రమ రేషన్ బియ్యం తరలింపుపై ప్రత్యేక నిఘా ఉంచింది. ఈ నేపథ్యంలో సోమవారం తెల్లవారు జామున 3గంటల ప్రాంతంలో నాగలాపురం తూర్పు దళితవాడలో బియ్యం లోడ్‌తో ఉన్న లారీని పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న 220 బస్తాల బియ్యం విలువ రూ. 3లక్షలు పైగా ఉంటుందని సమాచారం. ఈ అక్రమ రవాణా దందాలో ఏపీఎస్పీకి చెందిన కానిస్టేబుల్ కనుసన్నల్లో జరుగుతున్నట్లు సమాచారం

శాంతి భద్రతల పరిరక్షణకు నలుగురే..?

● చంద్రగిరి పోలీస్ స్టేషన్‌కు సిబ్బంది కొరత ● రకరకాల డ్యూటీలు పోనూ మిగిలేది కొద్దిమందే..



చంద్రగిరి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీస్ స్టేషన్‌ను సిబ్బంది కొరత వెంటాడుతోంది. పేరుకు సంఖ్య ఎక్కువగా కనిపిస్తున్నా వారంతా వివిధ విధుల్లో తలమునకలవడంతో నలుగురు కానిస్టేబుళ్లతోనే శాంతిభద్రతలను నెట్టుకురావడం తలనొప్పిగా తయారైంది. ఈ అప్‌గ్రేడ్ స్టేషన్‌లో సీఐ, ఇద్దరు ఎస్‌ఐలు, నలుగురు ఏఎస్‌ఐలు, తొమ్మిది మంది హెడ్ కానిస్టేబుళ్లు, 40 మంది కానిస్టేబుళ్లతో 56 మంది ఉండాలి. కానీ 37 మంది మాత్రమే ఉన్నారు. వీరిలో ఒకరు తిరుమల-1 టౌన్ పోలీస్ స్టేషన్‌లో, మరొకరు ఎస్వీయూ స్టేషన్‌లో పనిచేస్తున్నారు. ఇద్దరు మహిళా పోలీసులు తిరుపతి కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఉంటున్నారు. రక్షక్ వాహనానికి ఒకరు, బ్లూకోర్టు విధులకు, ఆర్‌ఎస్ మొబైల్ వాహనానికి, సీసీటీఎన్‌ఎస్(కంప్యూటర్ ఆపరేటర్)కు ఇద్దరు వంతున, హాస్పిటల్స్‌కు ఒకరు, రైటర్‌గా ఒకరు, అసిస్టెంట్ రైటర్‌గా ఒకరు, కోర్టు విధులకు ముగ్గురు, కోర్టు సమన్ల జారీకి ఒకరు, ఉండాల్సిందే. ఇక మిగిలేది నలుగు కానిస్టేబుళ్లు మాత్రమే.

నిత్యం పనిభారమే..

పట్టణం విస్తరించింది. నిత్యం చోరీలు సవాలు విసురుతున్నాయి. పూతలపట్టు-నాయుడుపేట, తిరుపతి- మదనపల్లె జాతీయ రహదారుల్లో నిత్యం ప్రమాదాలు జరుగుతుంటాయి. ఆర్ ఎస్ మొబైల్ వాహనం నిరంతరం తిరుగుతుంది. ఫలింగా పోలీస్ స్టేషన్ రిధిలో పని భారం పెరిగింది. ఇప్పుడున్న సిబ్బంది సంఖ్య ఎటూ సరిపోవడంలేదు. నగరానికి ఆనుకుని ఉన్నా ఇంటి అద్దె భత్యం 10 శాతం మాత్రమే చెల్లిస్తుండటం, రాజకీయ వివాదాలు ఎక్కువగా ఉండటంతో కొత్తగా ఇక్కడికి రావడానికి ఎవరూ ఆసక్తి చూపడం లేదని తెలిసింది. వీఐపీల తాకిడి ఎక్కువగా ఉంటే తిరుపతికి ఇక్కడనుంచే సిబ్బందిని పంపుతుంటారు. ఇలాంటప్పుడు ఒక్కరే విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత మండలం కావడంతో కీలకమైన చంద్రగిరి పోలీస్ స్టేషన్‌కు సరిపడా సిబ్బందిని నియమించాల్సిన అవసరముంది.

అమ్మవారి ఆలయానికి స్థలం కేటాయించండి

● మహారాష్ట్ర సీఎంకు టీటీడీ చైర్మన్ వినతి

తిరుమల, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): నవీ ముంబైలోని అమ్మవారి ఆలయం, టీటీడీ సమాచార కేంద్రం నిర్మించేందుకు స్థలం కేటాయించాలని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు సీఎం చంద్రబాబు నాయుడు ద్వారా మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం సాయంత్రం తిరుపతిలోని ఆశా కన్వెన్షన్ సెంటర్‌లో కుంభ్ ఆఫ్ టెంపుల్స్ సదస్సు సందర్భంగా ఈమేరకు కోరారు. ఇప్పటికే నవీ ముంబైలో ఉల్వే ప్రాంతంలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి 3.61 ఎకరాల స్థలాన్ని లీజు ప్రాతిపదికన కేటాయించారన్నారు. మరో 1.50 ఎకరాల స్థలంలో అమ్మవారి ఆలయాన్ని కూడా నిర్మించాలని టీటీడీ నిర్ణయించినందున స్థలాన్ని కేటాయించాలన్నారు. బాంద్రాలో టీటీడీ సమాచార కేంద్రానికి కూడా కొంత స్థలాన్ని కేటాయించాలని చైర్మన్ బీఆర్‌నాయుడు కోరారు.

కార్మికులందరికీ జీతాల బిల్లు పెట్టాలి



వినతి ఇస్తున్న వార్డుసభ్యులు

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గాంధీపురం గ్రామపంచాయతీల్లో చాలాకాలంగా పనిచేస్తున్న సిబ్బందిని యథావిధిగా కొనసాగిస్తూ.. ప్రస్తుతం విధుల్లో ఉన్నవారందరికీ జీతాలబిల్లు పెట్టాలని సోమవారం గ్రామసచివాలయంలో నిర్వహించిన సమావేశంలో తీర్మానించారు. ఇన్‌చార్జి సర్పంచ్ ఎం.లక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎంపీటీసీ సభ్యుడు జయకర్‌తోపాటు వార్డుసభ్యులు హాజరయ్యారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణదారులు, వీధివిక్రయదారులు రోజుకి రూ.50 చొప్పున చెల్లించేలా చర్యలు చేపట్టాలని, మూడుబోర్లు వేయాలని, అవిలాల చెరువుకు వాచ్‌మన్‌ను నియమించాలని నిర్ణయించారు. నాలుగేళ్లలో సిబ్బంది సంఖ్య 37మందికి పెరగడంపై వార్డుసభ్యులు అసంతృప్తి వెలిబుచ్చారు. ఆదాయం సిబ్బంది జీతాలకే సరిపోతే అభివృద్ధి పనులు ఎలా చేపడతామంటున్నారు.

మున్సిపల్ బహిరంగ వేలంపై..
కన్నేసిన వైసీపీ పాలకవర్గం!

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపల్ పరిధిలోని దినసరి మార్కెట్, జంతువధశాల, ప్రైవేటు బస్టాండ్‌ల నుంచి గుత్త వసూలు లీజు దక్కించుకునేందుకు అధికార వైసీపీ పాలకవర్గం కన్నేసింది. పోటీ లేకుండా లీజు దక్కించుకునే దిశగా చర్యలు చేపడుతున్నట్లు సమాచారం. గతంలో పాలకమండలి భరోసాతో డిపాజిట్ మొత్తం చెల్లించకుండా లీజు దక్కించుకుని గుత్త వసూలు చేసుకున్నారు. నేటికీ ఆ నిధులు మున్సిపాలిటీకి చెల్లించలేదు. ఈ అంశంపై రెండు పర్యాయాలు కౌన్సిల్ సమావేశంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు నిర్ణయం తీసుకున్నారు. కానీ, అమలుకు నోచుకోలేదు. గత కాంట్రాక్టర్ల నుంచి రూ.48.10 లక్షలు బకాయిలు వసూలు కావాల్సి ఉంది. కాగా, నేటి బహిరంగ వేలంలో బినామీ పేర్లతో లీజు దక్కించుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇప్పటి వరకు నలుగురు మాత్రమే లీజులో పాల్గొనేందుకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. గత ఏడాది దినసరి మార్కెట్ రూ.19.51 లక్షలతో దక్కించుకోగా ప్రైవేటు బస్టాండ్‌ను రూ.14.89 లక్షలు, జంతువధ శాలను రూ.4.87 లక్షలకు లీజుదార్లు దక్కించుకున్నారు. కాగా, ఈ ఏడాది లీజు మరింత ఎక్కువ ధర పలుకుతుందని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు.

లీజు బకాయిదారులు వీరే...

2021-22 జంతువధశాల లీజు నగదను నాగేంద్రబాబు రూ.2,15 లక్షలు, 2022-23కు గాను సునీల్ కుమార్ రూ.4.86 లక్షలు, 2023-24కు ఎస్.సుబ్రమణ్యం 5.42 లక్షలు చెల్లించాల్సి ఉండగా చెల్లించలేదు. ప్రైవేటు బస్టాండ్‌కు 2022-23కు చిరంజీవి రూ.9.73 లక్షలు బకాయి పడ్డాడు. దినసరి మార్కెట్‌కు 2023-24కు గాను జనార్ధన యాదవ్ రూ.25.92 లక్షలు చెల్లించాల్సి ఉంది. ఈ బకాయిలపై రూ.17.58 లక్షల వడ్డీ చెల్లింపులు చేయాల్సి ఉంది. బకాయి, వడ్డీతో కలిపి చెల్లించాల్సిన లీజు మొత్తం రూ.48.10 లక్షలుగా ఉంది.

నేడు బహిరంగ వేలం

పుత్తూరు మున్సిపల్ కార్యాలయంలో దినసరి మార్కెట్, జంతువధశాల, ప్రైవేటు బస్టాండ్ లీజుకు సంబంధించిన బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు కమిషనర్ మంజునాథ్ గౌడ్ పేర్కొన్నారు. దినసరి మార్కెట్‌కు రూ.20 లక్షల సాల్వెన్సీతో పాటు రూ.10 లక్షల డీడీ డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. ప్రైవేటు బస్టాండ్‌కు రూ.10 లక్షల సాల్వెన్సీతో పాటు రూ.6 లక్షలు డీడీ, జంతువధశాలకు రూ.3 లక్షల సాల్వెన్సీతో పాటు రూ.3 లక్షల డీడీ అందజేయాలని తెలియజేశారు. వేలం ముగిసే వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఈ లీజు కాల పరిమితి 2025 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2026 మార్చి 31వ తేదీ వరకు ఉంటుందన్నారు.



శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం బ్రహ్మోత్సవ సందడి మొదలైంది. ఈ వేడుకలకు శ్రీకారం చుడుతున్న క్రమంలో సాయంత్రం ఆగమోక్తంగా అంకురార్పణ కార్యక్రమాన్ని వేదపండితులు నిర్వహించారు. - చంద్రగిరి,ఆంధ్రజ్యోతి

రైలు ఢీకొని యువకుడి మృతి

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం ఉదయం రైలు ఢీకొని గుర్తుతెలి యని యువకుడు మృతి చెందాడు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, వయస్సు 25 సంవత్సరాలు ఉంటా యని రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదశాత్తు మృతి చెందాడా, లేక ఆత్మహత్య చేసు కున్నాడా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

కారు ఢీకొని మోటారు సైక్లిస్టుకు గాయాలు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పండ్లూరు జాతీయ రహదారి సమీపంలో మోటారు సైకిల్‌ను కారు ఢీకొన్న సంఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. కలిపేడు గ్రామానికి చెందిన వెంకయ్య మోటారు సైకిల్‌పై నాయుడుపేట వైపు వెళ్తుండగా పండ్లూరు జంక్షన్ వద్ద చెన్నై వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకయ్యకు గాయాలవడంతో 108 వాహనంలో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు.

సోలార్ ప్యానల్ లారీ బోల్తా

రేణిగుంట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి సోలార్ ప్యానళ్లతో నంద్యాలకు వెళుతున్న కంటైనర్ లారీ బోల్తాపడింది.ఈ సంఘటన సోమవారం తెల్లవారు జామున గాజులమండ్యం పోలీసు స్టేషన్ సమీపంలోని హైవేలో జరిగింది. వేగంగా వెళుతున్న లారీ ముందు ఎనుములు పరిగెత్తుకుంటూ రోడ్డుదాటుతుండగా వాటిని తప్పించబోయి కంటైనర్ లారీ బోల్తా కొట్టింది. కంటైనర్ లారీ లోపల ఉన్న సోలార్ ప్యానళ్లు పగిలిపోయాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు అవగాహన

రేణిగుంట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రేణిగుంట రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు జీఆర్‌పీ, ఆర్పీఎఫ్ పోలీసులు సంయుక్తంగా అవగాహన కల్పించారు. సోమవారం రాత్రి రైల్వే స్టేషన్‌లో వివిధ ప్రాంతాలకు వెళుతున్న ప్రయాణికులకు ఢిల్లీలో జరిగిన సంఘటనలపై అవగాహన కల్పించారు. అలాగే ప్రయాణికులు రైలులో ప్రయాణించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్పీఎఫ్, జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్లు సందీకుమార్, యతేంద్ర, జీఆర్‌పీ ఎస్ఐ రవి, ఆర్పీఎఫ్, జీఆర్‌పీ పోలీసుల సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడీల్లో కలకలం

నిరసనకు రాకుంటే తనిఖీలు తప్పవంటూ యూనియన్ నాయకురాలి హెచ్చరిక

వెదురుకుప్పం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి):అంగన్వాడీల నిరసన కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలంటూ యూనియన్ నాయకురాలొకరు బెదిరింపులకు దిగడం చర్చనీయాంశమైంది. వేతనాల పెంపుతో పాటు అనేక డిమాండ్లతో సీఐటీయూ అనుబంధ సంస్థ ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ సోమవారం కార్వేటినగరంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది.ఈ కార్యక్రమానికి కార్వేటినగరం, వెదురుకుప్పం, ఎస్‌ఆర్‌పురం మండలాల్లోని మెయిన్ అంగన్వాడీ సెంటర్ల వర్కర్లు తప్పనిసరిగా హాజరు కావాలని,లేకుంటే వారు పనిచేస్తున్న సెంటర్లకు విస్తృత తనిఖీలు తప్పవని హెచ్చరిస్తూ యూనియన్ నాయకురాలు ఒకరు సోషల్ మీడియా, స్థానిక వాట్సాప్ గ్రూపుల్లో విడుదల చేసిన ఆడియో సందేశం కలకలం రేపింది.ఇలా ఆదేశాలివ్వడం ఏంటని కొందరు అంగన్వాడీలు వెంటనే సీడీపీవోకు, ఇతర అధికారులకు ఆ ఆడియోలను పంపించారు.ఇదే విషయాన్ని సీడీపీవో పద్మసునంద వద్ద ప్రస్తావించగా ఆడియో సందేశం తన దృష్టికి వచ్చిందన్నారు.

మహాశివరాత్రి ఏర్పాట్లు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి ఉత్సవాల కోసం ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. మూడు రోజులు మాత్రమే సమయం మిగిలి ఉండటంతో ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. అధికారులతో సమావేశాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి.

అర్ధరాత్రి పోలీస్ స్టేషన్‌లో మంచు మనోజ్



హెడ్ కానిస్టేబుల్‌తో వాదిస్తున్న మనోజ్

భాకరాపేట/ఎర్రావారిపాళెం,ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : సినీనటుడు మంచు మనోజ్‌కుమార్ సోమవారం రాత్రి భాకరాపేట పోలీస్ స్టేషన్‌కు రావడం కలకలం రేపింది.భాకరాపేట ఘాట్ రోడ్డులో ఉన్న లేక్ వ్యాలీ రిసార్ట్స్‌లో మనోజ్‌కుమార్ బస చేశారు.ఎస్ఐ రాఘవేంద్ర రాత్రి 11గంటల సమయంలో గస్తీ నిర్వహణలో భాగంగా ఆ రిసార్ట్ వద్దకు వెళ్ళి ఎవరెవరున్నారు అని విచారించారు.మనోజ్ వున్నాడని సిబ్బంది చెప్పారు. అదే సమయంలో ఎస్ఐ వద్దకు వచ్చిన మనోజ్ ఇక్కడికి పోలీసులు ఎందుకు వచ్చారని ప్రశ్నించారు.సెలబ్రిటీ అయిన మీరు దట్టమైన అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉండడం అంత మంచిది కాదని ఎస్ఐ చెప్పారు.అయితే తాను రిసార్ట్‌లో ఉంటే సైరన్ ఎందుకు వేస్తారని, తన ప్రైవసీని ఎందుకు డిస్ట్రబ్ చేస్తారని మనోజ్‌కుమార్ ఎస్ఐని ప్రశ్నించారు.అనంతరం రిసార్ట్స్ నుంచి భాకరాపేట పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న ఆయన సీఐ ఇమ్రాన్ బాషాతో ఫోన్‌లో వాదనకు దిగారు.సీఎం పేరుతో తనను, తన అనుచరులను బెదిరిస్తున్నారని, సీఎంస్థాయి వ్యక్తి ఇంతచిన్న విషయాన్ని ఎందుకు పట్టించుకుంటారని ప్రశ్నించారు. మోహన్‌బాబు విశ్వవిద్యాలయం వద్దవున్న షాపులను ధ్వంసం చేస్తే మాత్రం పోలీసులు ఎందుకు పట్టించుకోరని ప్రశ్నించారు. అర్ధరాత్రి తర్వాత కూడా పోలీస్ స్టేషన్‌లోనే బైఠాయించిన మనోజ్ తనను ఎందుకు వెంబడిస్తున్నారో పోలీసు అధికారులు చెప్పాలని డిమాండు చేశారు.తన ప్రైవసీకి భంగం కల్గించబోమని హామీ ఇస్తేనే వెళతానని చెప్పారు.చివరకు రాత్రి 12.50గంటలకు పోలీస్ స్టేషన్ నుంచి మనోజ్ వెళ్లిపోయారు.



భాకరాపేట పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించిన మనోజ్

సీఎం చంద్రబాబుకు స్వాగతం



తిరుపతి పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబుకు సోమవారం విమానాశ్రయంలో టీడీపీ నేతలు, అధికారులు స్వాగతం పలికారు. ఇందులో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, కార్పొరేటర్ అన్నా అనిత యాదవ్, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధనరాజు, టీటీడీ ఈవో శ్యామలరావు, జేఈవో వెంకయ్య చౌదరి, శాప్ చైర్మన్ రవినాయుడు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం ఉన్నారు.

వామ్మో ఆర్థో వార్డు..!

కానరాని వైద్యులు, సిబ్బంది ● పడకలున్నా వరండాలోనే వైద్యం ● రుయా తీరుపై సర్వత్రా విమర్శలు



వరండాలో ఇరుకు మంచాలపై అవస్థలు పడుతున్న రోగులు

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రుయాస్పత్రిలో ఆర్థో వార్డు అంటే అమ్మో అని భయపడే పరిస్థితి ఉంది. ఈ వార్డు ఆస్పత్రికి దూరంగా అలిపిరి ప్రధాన రోడ్డును ఆనుకుని ఉంటుంది. నిత్యం పాములు, దొంగల బెడద ఉంది. అక్కడికి వెళ్లాలంటే సరైన రోడ్డు మార్గం ఉండదు. నిర్మానుష్య ప్రదేశం కావడంతో అక్కడ ఉండడానికి రోగులే కాదు.. వారి సహాయకులు సైతం భయపడుతున్నారు. ఈ వార్డులో 50 పడకలున్నాయి. సర్జరీలు చేసిన వారిని కింద, మిగతా వారిని పైన వార్డులో ఉంచి వైద్యం అందిస్తున్నారు. వైద్యులు, సిబ్బంది చుట్టపు చూపుగా వచ్చి వెళుతుంటారు. అత్యవసరమైతే రోగుల సహాయకులు వెళ్లి చెబితే వైద్యులు తీరిగ్గా చేరుకుని రోగులను పరీక్షిస్తున్నారన్న విమర్శలున్నాయి. విభాగాధిపతులైతే కేవలం ఫోన్లలోనే అక్కడి సిబ్బంది సహాయంతో చికిత్స చేసే పరిస్థితి నెలకొంది.



వార్డులో ఖాళీగా దర్శనమిస్తున్న పడకలు

వరండాలోనే వైద్యం..

వార్డులో పడకలు ఉన్నప్పటికీ రోగులను వరండాలోనే ఉంచి వైద్యం అందిస్తున్నారు. పైగా ఇరుకు మంచాల్లో పడుకోబెడుతుండడంతో బాగా అవస్థలు పడుతున్నారు. ఇదేమని అడిగితే 'మీరు వార్డులను శుభ్రంగా ఉంచడం లేదని, అందునే బయటే ఉంచుతాం' అని సమాధానం చెబుతున్నారు. దీనికితోడు వార్డు ఆస్పత్రికి దూరంగా ఉండటంతో అధికారుల పర్యవేక్షణ ఉండడం లేదు. రుయా అధికారులు దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో 12 మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 12 మందిని సోమవారం తిరుపతి నాలుగో అదనపు జ్యుడీషియల్ న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ ఎదుట హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించారు. 12 మందికి రూ.1.20 లక్షలు విధిస్తూ తీర్పు చెప్పారు.

రేపు మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం ప్రారంభం

ప్రారంభించనున్న మంత్రి లోకేశ్



ఇండోర్ స్టేడియాన్ని పరిశీలిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

తిరుపతి(క్రీడలు), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ ప్రాంగణంలో రూ.5.75 కోట్లతో నిర్మించిన ఖేలో ఇండియా మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంను బుధవారం ప్రారంభించనున్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రారంభించనున్నారు. ఈ మేరకు శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు, మహిళా వర్సిటీ వీసీ వీ ఉమ, రిజిస్ట్రార్ ఎన్.రజని, పీఈడీ ఎస్.సరోజని, డీఎస్‌డీవో సయ్యద్‌సాహెబ్, టీడీపీ నేత మహేష్ యాదవ్ సోమవారం ఏర్పాట్లను పరిశీలించారు. ఆ రోజున బాలబాలికలతో క్విజ్ పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

తిరుపతిలో ముగిసిన తెలుగు వికీపీడియా పండగ-2025



తెలుగు వికీపీడియా పండగ-2025లో పాల్గొన్న ప్రతినిధులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తిరుపతి వేదికగా మూడు రోజులపాటు జరిగిన తెలుగు వికీపీడియా పండగ-2025 ముగిసింది. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 50 మంది ప్రతినిధులు ఈ పండగలో పాల్గొన్నారు. 2003లో ప్రారంభమైన తెలుగు వికీపీడియా, లక్షకు పైగా వ్యాసాలతో విస్తరించిందని సదస్సులో వక్తలు తెలిపారు. తెలుగు వికీపీడియాను విస్తరించే మార్గాలు, వికీపీడియా రచయితల్లో రచనా నైపుణ్యాన్ని పెంపొందించడం, వికీపీడియా వ్యాసాలను ప్రజలకు మరింత విస్తరించడం వంటి కీలక అంశాలపై ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించారు. అలాగే తెలుగు వికీపీడియాలో చేరండి - విజ్ఞానాన్ని అందరికీ పంచండి' అంటూ తిరుపతి వీధుల్లో వికీపీడియా సభ్యులు ప్రదర్శన నిర్వహించారు. దశాబ్ద కాలంగా వికీపీడియాకు విశేష సేవలు అందించిన వారిని ఈ సందర్భంగా సత్కరించారు. వీరిలో ఎర్రా రామారావు, ఎస్‌ఆర్ గుళ్లపల్లి, శ్రీరామమూర్తి, బత్తిని వినయ్‌కుమార్‌గౌడ్, స్వరలాసిక, టి.సుజాత, రవిచంద్ర, రామేశం, ఐ.మహేష్, టీకే విశ్వనాథ్, తదితరులు ఉన్నారు.

భో.. శంభో..!

ఆకట్టుకున్న త్రివేణి సంగమ భరతనాట్య ప్రదర్శన



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): భో.. శంభో అంటూ సాగిన భరతనాట్య ప్రదర్శన ఆద్యంతమూ ఆహూతులను కట్టి పడేసింది. అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ - 381వ కార్యక్రమంతో తిరుపతిలోని అన్నమాచార్య కళా మందిరంలో సోమవారం సాయంత్రం భరతనాట్య ప్రదర్శన నిర్వహించారు. అమెరికాలోని శాక్రమెంటో నగరానికి చెందిన కళాధర సంస్థకు చెందిన మధురా విశ్వనాథన్ బృందం ఈ ప్రదర్శన నిర్వహించింది. కుంభమేళా నేపథ్యంలో త్రివేణి సంగమం పేరుతో ఈ భరటనాట్య ప్రదర్శన సాగింది. రెండు గంటల పాటు నిరంతరాయంగా సాగిన ఈ నాట్య ప్రదర్శనపై నగర ప్రముఖులు ప్రశంసల జల్లు కురిపించారు. వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య రాణీసదాశివమూర్తి మాట్లాడుతూ భరతనాట్యం భారతీయ సంస్కృతికి ప్రతీక అని తెలిపారు. దాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యతన్నారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య జీఎస్ఆర్ కృష్ణమూర్తి, అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ప్రధాన కార్యదర్శి పాంచ్ర సురేంద్రనాయుడు మాట్లాడుతూ తిరుపతి కళా వైభవాన్ని ఉన్నతీకరించే విధంగా అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ అనేక కార్య క్రమాలు నిర్వహిస్తోందన్నారు. శ్వేత మాజీ డైరెక్టర్ భూమన్, టీటీడీ ప్రాజెక్టు అధికారి ఆకెళ్ల విభీషణశర్మ మాట్లాడుతూ గంగా యమునా సరస్వతుల సంగమ త్రివేణి కుంభమేళా గురించి శాస్త్రీయంగా, ఆధ్యాత్మికంగా వివరణ ఇస్తూ భరతనాట్య ప్రదర్శన ఇవ్వడం అభినందనీయమన్నారు. కళాధర్ బృందం గురువు మధుర విశ్వనాథన్ సైతం అద్వితీయ భరత నాట్య ప్రదర్శన ఇచ్చారు. కళాకారులను సత్కరించారు. జీఎల్ మనోహర్, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

సీఎంకు వెటర్నరీ విద్యార్థుల వినతి

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పర్యటను వచ్చిన సీఎం చంద్రబాబుకు సోమవారం సాయంత్రం ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు వినతిపత్రం సమర్పించారు. ఎయిర్‌పోర్టులో కలసి వైద్య విద్యార్థులతో సమానంగా తమకు స్టైఫండ్ పెంచాలని విన్నవించారు.



సీఎంకు వినతిపత్రం ఇస్తున్న వెటర్నరీ విద్యార్థులు

టీవీసీసీ సేవలను అడ్డుకున్న వెటర్నరీ విద్యార్థులు

వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచాలని ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారమూ కొనసాగింది. ఇందులో భాగంగా తారకరామ వెటర్నరీ క్లినికల్ కాంప్లెక్స్ (టీవీసీసీ) వద్దకు చేరుకుని వైద్యసేవలను అడ్డుకున్నారు. క్లినికల్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓపీ సేవలను నిలిపివేశారు. ఎమర్జెన్సీ సేవలకు మాత్రమే అనుమతిచ్చారు. విద్యార్థులు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో ఎమర్జెన్సీ సేవలను కూడా అడ్డుకుంటామని హెచ్చరించారు.

ఆటోలో పోగొట్టుకున్న పర్సు అప్పగింత

తిరుపతి (నేరవిభాగం), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మహిళ ఆటోలో పోగొట్టుకున్న పర్సును తిరిగి అప్పగించారు. ఏర్పేడు మండలం వికృతమాలకు చెందిన విమల సొంత పని నిమిత్తం తిరుపతికి వచ్చారు. బస్టాండు నుంచి ఆటోలో వెళుతూ పర్సు పోగొట్టుకుంది. అదే ఆటోలో ప్రయాణిస్తున్న వరదయ్యపాలెంకు చెందిన మీర్జాన్‌బాషా దాన్ని గమనించి రామచంద్రాపురం ఎస్‌ఐ రామాంజనేయులుకు అప్పగించారు. పర్సులోని ఆధార్ కార్డులో ఉన్న వివరాల మేరకు అది విమలదిగా గుర్తించి, సమాచారం అందించారు. జిల్లా అదనపు ఎస్పీ రవిమనోహరాచారి చేతులమీదుగా విమలకు పర్సును అప్పగించారు. అందులో రూ.8,500నగదు ఉన్నట్లు తెలిపారు. మీర్జాన్‌బాషాను అభినందించారు.



పర్సును బాధితురాలికి ఇస్తున్న ఏఎస్పీ రవిమనోహరాచారి

తలుపు తట్టిన వృద్ధుడిపై దాడి

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఇంటి తలుపు తట్టిన వృద్ధుడిపై దాడిచేసి, గాయపరచిన ఘటన సోమవారం స్థానిక తాతానగర్‌లో చోటు చేసుకుంది. ఈస్ట్ ఎస్‌ఐ బాలకృష్ణ కథనం మేరకు... తాతానగర్‌లో నివాసముంటున్న జ్యోతి ఇంటికి గుర్తు తెలియని వృద్ధుడు వెళ్లి తలుపు తట్టాడు. దీంతో ఆమె భర్త, మరికొందరు కలసి అతనిపై దాడి చేశారు. రక్తగాయాలతో స్పృహ తప్పి పడిపోయాడు. స్థానికులు ఆయన్ను చికిత్స నిమిత్తం తిరుపతిలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అతని వివరాలు తెలిసిన వారు తిరుపతి ఈస్ట్ ఎస్‌ఐ బాలకృష్ణకు 9908192028కు ఫోన్ చేయాలని కోరారు.



గాయపడిన వృద్ధుడు

ఆటవెలదిని ఈటెగా విసిరిన వేమన

ఎస్వీయూ పూర్వ విద్యార్థుల సంఘం సభలో రచయిత స.వెం.రమేష్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆటవెలదిని ఈటెగా చేసి సమాజంలోని ఛాందస భావాలకు పద్యాలతో వేమన అడ్డుకట్ట వేశారని రచయిత స.వెం.రమేష్ అన్నారు. ఎస్వీయూ పూర్వ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సెనేట్ హాల్లో సోమవారం జరిగిన సభలో వేమన తత్వంపై ఆయన మాట్లాడారు. సామాజిక రుగ్మతలను హేతుబద్ధంగా వేమన ప్రశ్నించారన్నారు. సమాజంలో కనిపించిన ప్రతి అస్తవ్యస్థత మీద పద్యాల రూపంలో వేమన ప్రతిస్పందించారని అన్నారు. ఎస్వీయూ పీజీ సెంటర్ ఎస్‌ఓ శివారెడ్డి మాట్లాడుతూ అశాస్త్రీయ భావాలను శాస్త్రీయంగా పద్యాల రూపంలో వేమన విమర్శించారని అభిప్రాయపడ్డారు. ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ అప్పారావు మాట్లాడుతూ వేమన పద్యాలు మనిషి నైతిక మార్గంలో నడిచేందుకు తోడ్పడతాయన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు మాట్లాడుతూ సామాజిక గడ్డు వాస్తవికతను పద్యాల రూపంలో వ్యక్తం చేసిన కవి వేమన అని అన్నారు. సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ కేటీ రామకృష్ణారెడ్డి అధ్యక్షతన చేపట్టిన ఈ సభలో పూర్వ విద్యార్థి సంఘం కార్యదర్శి ప్రొఫెసర్ కేవీ సరిత, ప్రొఫెసర్ సుచరిత, ప్రొఫెసర్ సుధాకరయ్య, ప్రొఫెసర్ అమీనుల్లా, తెలుగు విభాగాధిపతి రాజేశ్వరమ్మ, రిటైర్డు ప్రొఫెసర్లు కాటూరి శారద, భాస్కరరెడ్డి, మునిరత్నంరెడ్డి, జయచంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న స.వెం.రమేష్, వేదికపై వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ జేఏసీ నూతన కార్యవర్గం

తిరుపతి(ఆటోనగర్) ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): ఏపీ గవర్నమెంట్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్, వర్కర్స్ అండ్ టీచర్స్ జేఏసీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తిరుపతిలో రెండు రోజులపాటు జరిగిన కమిటీ సమావేశాల్లో అధ్యక్షుడిగా జి.నాగవెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా ఏ ప్రదీప్‌కుమార్, ఉపాధ్యక్షులుగా ఎస్.సుబాన్, అమరనాథ్, చెంగలరాయులు, సుబ్బరాయుడు, రాము, లోకేష్ బాబు, సహాధ్యక్షులుగా బాబు, ఎస్.మొయిద్దీన్, పి.వరలక్ష్మి, మునికృష్ణయ్య, గంగయ్య, నిర్వాహక కార్యదర్శులుగా జి.చిన్నబాబు, ఎస్.జయచంద్ర, కార్యదర్శులుగా మహేష్, నారాయణమ్మ, నరసింహులు, రేఖ, ఈశ్వర్‌రెడ్డితో పాటు 17 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

మత ప్రాతిపదికన ఉద్యోగ నియామకాలు రాజ్యాంగ విరుద్ధం

స్విమ్స్‌లో విద్యార్థి సంఘాల నేతలు నిరసన

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో రేడియోలాజికల్ ఫిజిక్స్(మెడికల్ ఫిజిసిస్ట్) పోస్టులకు ఈ నెల 10న విడుదల చేసిన నోటిఫికేషన్‌లో హిందువులకు మాత్రమే అని పేర్కొనడం రాజ్యాంగ విరుద్ధమని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చలపతి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అక్బర్ పేర్కొన్నారు. ఈ మేరకు పలు విద్యార్థి సంఘాల నేతలు సోమవారం స్విమ్స్ పరిపాలనా భవనం ముందు నిరసన వ్యక్తం చేశారు. టీటీడీ విద్యా, వైద్య సంస్థలు రాజ్యాంగ బద్ధంగా నడుస్తున్నాయని, అలాంటప్పుడు స్విమ్స్‌లో ఉద్యోగాల నోటిఫికేషన్‌లో హిందువులకు మాత్రమే అని పేర్కొనడం సరైన పద్ధతి కాదని అన్నారు. స్విమ్స్ ప్రతిష్ఠను దిగజార్చే విధంగా ఉన్న ఆ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఈ విషయంపై స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ రామ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. విద్యార్థి సంఘాల నేతలు రవి, ఉదయ్, ప్రవీణ్, మల్లికార్జున్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



స్విమ్స్ పరిపాలనా భవనం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘ నేతలు

ఘనంగా ఫిషర్ జయంతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పద్మావతి వర్సిటీ స్టాటిస్టిక్స్ విభాగంలో సోమవారం గణాంక శాస్త్రవేత్త ఆర్ఏ ఫిషర్ జయంతి నిర్వహించారు. ఫిషర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, గణాంక శాస్త్రానికి చేసిన కృషిని కొనియాడారు. ప్రతిభా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్టాటిస్టిక్స్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బహుమతి అందుకుంటున్న విద్యార్థిని

ఆవును కాపాడబోయి చెరువులో మునిగిపోయాడు!

తవణంపల్లె, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆవును రక్షించడానికి వెళ్లి చెరువులో మునిగి ఓ వ్యక్తి సోమవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తవణంపల్లె మండలంలోని తెల్లగుండ్లపల్లె గ్రామానికి చెందిన రామకృష్ణమనాయుడు కుమారుడు లోకనాథనాయుడు(46) తన పాడి ఆవును కడగడానికి గ్రామ సమీపంలోని కోడమ్మనాయుడు చెరువుకు తీసుకెళ్లాడు. ఆవును కడుగుతుండగా చెరువు లోపలికి వెళ్లిపోవడంతో కంగారుపడ్డ లోకనాథనాయుడు దానివెంట లోపలికి వెళ్లి మునిగిపోయాడు. కాసేపటికి ఆవు క్షేమంగా బయటకొచ్చేయగా రక్షించడానికెళ్లిన యజమాని చెరువులో మునిగి మృతి చెందాడు. చిత్తూరు అగ్నిమాపకశాఖ సాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. లోకనాథ నాయుడి భార్య వరకుమారి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



లోకనాథనాయుడి మృతదేహం

గంజాయి స్వాధీనం

నగరి, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగరాజకుప్పం సమీపంలో గంజాయి తరలిస్తున్న ముగ్గురు తమిళనాడు వాసులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 1150 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. సీఐ మహేశ్వర్ మీడియాకు సోమవారం వివరాలు తెలిపారు. గంజాయి తరలిస్తుండగా తిరుత్తణికిచెందిన కిశోర్(25), తిరువళ్లూరు జిల్లాకు చెందిన తిరునింద్రవూరు వాసి మణిగండన్, అరక్కోణం తాలూకాకు చెందిన కుంబినిపేట నివాసి మునస్వామి(20)లను పట్టుకున్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేశామన్నారు.

పాఠశాల ఆవరణలో దేవాంగపిల్లి

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు సమీపంలోని డాన్ బోస్కో పాఠశాల ఆవరణలో సోమవారం ఓ దేవాంగపిల్లి ప్రత్యక్షమైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కిరణ్‌కిషోర్ పాఠశాలకు చేరుకున్నారని తెలిపారు. దేవాంగపిల్లిని స్వాధీనం చేసుకుని అటవీప్రాంతంలో వదిలివేసినట్లు చెప్పారు.





ఇంటర్నేషనల్ టెంపుల్ కన్వెన్షన్ ఎక్స్‌పోలో పాల్గొని తిరుగు ప్రయాణంలో అభిమానులకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.

మహారాష్ట్ర సీఎంను కలిసిన టీటీడీ ఈవో



శ్రీవారి దర్శనం కోసం వచ్చిన మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌ను సోమవారం టీటీడీ ఈవో శ్యామలరావు తిరుమలలోని పద్మావతి అతిథిగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా నవీ ముంబైలో శ్రీవారి ఆలయ నిర్మాణంపై దేవేంద్ర ఫడ్నవీస్‌తో చర్చించారు. ఆలయ నిర్మాణానికి ఉన్న అడ్డంకులన్నీ తొలగిపోయి త్వరతగతిన నిర్మాణం జరిగేందుకు సహకరించాలని ఈవో కోరగా, మహారాష్ట్ర సీఎం సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, సౌరభ్ హెచ్‌బోరా పాల్గొన్నారు.

-తిరుమల, ఆంధ్రజ్యోతి


ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.20 లక్షల విరాళం

తిరుమల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు సోమవారం రూ.20 లక్షలు విరాళంగా అందాయి. పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన వెంకటరమణ రూ.10 లక్షలు, తిరుపతికి చెందిన సాధు పృథ్వీ రూ.10 లక్షలు చొప్పున విరాళం డీడీలను తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.



అదనపు ఈవోకు డీడీ అందజేస్తున్న సాధు పృథ్వీ

శ్రీహరి సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లోని 15 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్‌1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

బుధవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.77 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 60,203

తలనీలాలు సమర్పించినవారు: 21,793



మన శివాలయాలు

ఇక్కడ అడుగు పెట్టగానే కాశీ విశ్వేశ్వరుడే కాదు సకల దేవతామూర్తులూ దర్శనమిస్తారు. అందుకే దక్షిణ కాశీగా భక్తుల మనసులో ఆధ్యాత్మిక ముద్ర వేసుకుంది.. నగరి మండలం బుగ్గఅగ్రహారంలోని అన్నపూర్ణసమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం శతాబ్దాలుగా ఇతిహాస,చరిత్రలకు సాక్షిగా నిలుస్తోంది. ఈ దివ్యధామం గురించి తెలుసుకుంటే...

- నగరి, ఆంధ్రజ్యోతి

బుగ్గ అగ్రహారం భూకైలాసం

కొలువు దీరిన కాశీ విశ్వేశ్వరుడు



కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ గోపురం - దోనె నుంచి తీర్థం నీరు

సప్త రుషుల్లో ఒకరైన గౌతమి మహర్షి దేశసంచారంలో భాగంగా బుగ్గ అగ్రహారం వద్ద సేదతీరారని ఇతిహాసగాథ ప్రచారంలో ఉంది. గంగా తీరాన కాశీఆలయం తరహాలోనే ఇక్కడి కుశస్థలీ నది ఒడ్డున వాతావరణం పోలి ఉన్నట్టు ఆయన గుర్తించారు.



ఆలయ ముఖద్వారం

దక్షిణభాగంలోనూ ఇది కాశీగా భాసిల్లుతుందని భావించారట. పాండవులు వనవాస సమయాన ఈ ప్రాంతంలో సంచరించి కాశీని తలపించే దేవతా విగ్రహాలు ఇక్కడ ఉండటాన్ని గమనించారని చెబుతారు. ఆక్రమంలోనే నీటి కోసం కాశీ, గుహ, భవాని, పుణికర్ణిక, అయ్యవున అనే దోనెలను సృష్టించారంటారు. శివభక్తులైన చోళరాజులు ఇక్కడి విశిష్టత గుర్తించి క్రీ.శ. 1562లో అన్నపూర్ణసమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించినట్లు ప్రస్తుత ఆలయ ప్రధానార్చకుడు కుప్పయ్యస్వామి తెలిపారు.

ఆలయాల ఆధ్యాత్మిక మాల

బుగ్గ దేవాలయ ప్రాంగణంలో సకల దేవతల ఆలయాలూ ఉన్నాయి. విశ్వేశ్వరుడు, కామాక్షిదేవి, అన్నపూర్ణదేవి, భూనీలాదేవి సమేత ప్రయాగ మాధవస్వామి, కాలభైరవస్వామి, దొంటిగణపతి, సద్యోజాత మూర్తి, వాసుదేవమూర్తి, అఘోర మూర్తి, వళ్లిదేవయాని సమేత సుబ్రమణ్యస్వామి, భక్తకన్నప్ప, దుర్గాదేవి, తత్పురుష మూర్తి, వీరభద్రస్వామి, మహిషాసురమర్ధిని, సూర్యనారాయణస్వామి, భక్తాంజనేయస్వామిలు భక్తుల నుంచి పూజలందుకుంటున్నారు.

30ఏళ్లుగా టీటీడీ నిర్వహణ



ఆలయ ప్రాంగణంలో చిన్న దేవాలయాలు

చోళరాజులు, కార్వేటినగరం రాజుల తర్వాత తిరుపతి ఆలయ మహంతులు ఈ ఆలయాన్ని పర్యవేక్షించారు. 1980లో ఆలయాన్ని అభివృద్ధి చేశారు. 1994 నుంచి నిర్వహణ బాధ్యతను తిరుమల తిరుపతి దేవస్థానం తీసుకుంది. శివుడితోపాటు పలు దేవుళ్ల విగ్రహాలు ఉండటంతో శివరాత్రి మాత్రమే కాదు ఏటా ఏకాదశి, వినాయకచవితి, ఆడికృత్తిక, సంక్రాంతి, విజయదశమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అయితే వేసవి తీవ్రత నేపథ్యంలో గతేడాది అక్టోబరులో నవరాత్రి ఉత్సవాలలో రెండు దోనెల్లో మాత్రమే నీరు ప్రవహించిది. స్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తులు ఈ నీటితో స్నానమాచరించారు. ఈఏడాది శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆరోజు ఉదయం నుంచి రాత్రివరకూ ప్రసాద వితరణ ఉంటుందని అర్చకులు తెలిపారు.







డ్రోన్‌ల నుంచి కీచైన్‌ల దాకా..

● ఆకట్టుకుంటున్న టెంపుల్ ఎక్స్‌పో

తిరుపతిలో సోమవారం మొదలైన మూడురోజుల ఇంటర్నేషనల్ టెంపుల్స్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో-2025 (ఐటీసీఎక్స్)లో ఏర్పాటుచేసిన పలు రకాల స్టాల్స్ ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యద్వారా వద్ద బంగారుపూతతో మినీ ధ్వజస్తంభం ఏర్పాటు చేశారు. ఆలయాల నిర్వహణలో ఉపకరించే ఆధునిక పరికరాలు, భద్రతకు ఉపయోగపడే ఎలక్ట్రానిక్ పరికరాలు ఈ ప్రదర్శనలో ఉన్నాయి. భారతీయ సంప్రదాయ చేనేత వస్త్రాలు, జానపద సంప్రదాయ చిత్రాలు కూడా ఉఆన్నయి. డ్రోన్‌లు, ఫ్లయింగ్ కెమెరాలు, సీసీ కెమెరాలు, టూవీలర్లూ, కార్లకు క్విక్ చార్జింగ్ యంత్రాలు, మూవింగ్ ఎల్ఈడీ స్ర్కీన్స్ ఈ ప్రదర్శనలో ఆకర్షిస్తున్నాయి.

మిరుమిట్లు గొలిపే కలర్‌ఫుల్ ఎల్ఈడీ లైట్లు, డిజిటల్ లాకర్స్ మొదలు ఆటోమేటిక్ క్లీనింగ్ యంత్రాల దాకా ప్రదర్శనలో చోటు చేసుకున్నాయి.


- తిరుపతి అర్బన్,ఆంధ్రజ్యోతి













పీజీఆర్ఎస్‌కు 238 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవేంద్రరెడ్డి

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 238 వినతులు వచ్చాయి. అందులో ప్రధానంగా భూ సమస్యలపై 161 అర్జీలు ఉన్నాయి. జిల్లాలోని పలు మండలాల నుంచి ప్రజలు హాజరై తమ సమస్యలపై వినతులు సమర్పించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, సుధారాణి, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు వినతులు స్వీకరించారు.

పింఛన్ ఇప్పించండి మహాప్రభో..!



అగ్ని ప్రమాదంలో గాయపడి నడవలేని స్థితికి చేరుకున్నాను. ఎన్నో ఏళ్లుగా వస్తున్న పింఛన్‌ను రెండేళ్ల క్రితం గత ప్రభుత్వం నిలిపివేసింది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నా. కరుణించి పింఛను పునరుద్ధరించండి.

- గురుస్వామి, దివ్యాంగుడు, జీవకోన

గ్రామానికి రోడ్డు వేయండి



రోడ్డు కోసం ఆందోళన చేస్తున్న వడమాల దళితవాడవాసులు

30 ఏళ్లుగా గ్రామానికి రోడ్డు లేక ఇబ్బంది పడుతున్నామని, కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా లాభం లేకపోయిందని వడమాలపేట మండలం వడమాల దళితవాడ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. వెంటనే రోడ్డు ఏర్పాటు చేయాలని అధికారులకు విన్నవించారు.

తిరుమలలో వేసవి ఉపశమన చర్యలు



వేసవి రాకముందే తిరుమలలో ఎండ మండుతోంది. వారం రోజులుగా చెప్పులు లేకుండా నడవటం ఇబ్బందిగా మారింది. పరిస్థితిని గుర్తించిన టీటీడీ అధికారులు తక్షణ చర్యలను ప్రారంభించారు. వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటితో నేల భాగాన్ని చల్లబరుస్తున్నారు. రానున్న వారం రోజుల్లో పలు ప్రదేశాల్లో చలువ పందిళ్లు వేయనున్నారు. అవసరమైన చోట కూల్ పెయింట్ వేయాలని ఉన్నతాధికారులు సంబంధిత అధికారులను ఆదేశించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణపై అవగాహన

తిరుపతి(ఆర్టీసీ), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సొంతంగా ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ చేపట్టనుండడంతో సోమవారం అధికార యంత్రాంగానికి అవగాహన కల్పించారు. అలిపిరి డిపో కార్యలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హైదరాబాదుకు చెందిన వీఎన్ఆర్ అండ్ విజ్ఞానజ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ అండ్ రీసెర్చ్ ప్రతినిధి అస్లామ్ అన్సారి, ఆటోమొబైల్ ఇంజనీరింగ్ డిపార్టుమెంట్ ప్రొఫెసర్లు అంజర్‌ఖార్, రమేష్, హరీష్ హాజరై విద్యుత్ బస్సుల వినియోగంతో కలిగే ప్రయోజనాలు, అనుకూలతలు, మెరుగైన నిర్వహణ వంటి అంశాలను వివరించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఒకే దఫాలో రాష్ట్రానికి 750 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నట్లు తెలుస్తోంది. ఈ సదస్సులో డీపీటీవో జి.నరసింహులు, డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, డీఎంలు బాలాజీ, హరిబాబు, భాస్కర్, పుష్పలత, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఎస్వీయూను సందర్శించిన యూఎస్ఏ ప్రతినిధి


తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అమెరికాకు చెందిన పార్డ్యూ యూనివర్సిటీ ప్రతినిధి జూలియానా కస్సవన్ సోమవారం ఎస్వీ యూనివర్సిటీని సందర్శించారు. గతంలో ఎస్వీయూతో పార్డ్యూ వర్సిటీ అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం మేరకు బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో ఈ రెండు వర్సిటీలు పరస్పరం సహకరించుకోనున్నాయి. ఎస్వీయూ ఫిజిక్స్ విభాగాన్ని సందర్శించిన జూలియానా కస్సవన్‌ను ఫిజిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ దేవప్రసాదరాజు సత్కరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు విజయలక్ష్మి, అపర్ణ, రుద్రమదేవి తదితరులు పాల్గొన్నారు.



జూలియానా కస్సవన్‌ను సత్కరిస్తున్న దేవప్రసాదరాజు

టీటీడీ చైర్మన్ ఫొటో డీపీగా పెట్టుకుని..

● ఎన్ఆర్ఐలను మోసగిస్తున్న కేటుగాడు



తిరుమల సమాచారంతో పేరుతో ఉన్న వాట్సాప్ గ్రూప్

తిరుమల, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడి ఫొటోను వాట్సాప్ ప్రొఫైల్ ఫొటోగా పెట్టుకుని ఎన్ఆర్ఐ భక్తులను మోసగిస్తున్న ఘటన సోమవారం వెలుగుచూసింది. మోసపోయిన కొందరు భక్తులు ఇటీవల టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకి ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెల్లడైంది. హైదరాబాద్‌లోని ఓల్డ్‌సిటీకి చెందిన మహ్మద్ జావెద్ ఖాన్ 'తిరుమల సమాచారం' పేరుతో ఓ వాట్సాప్ గ్రూప్‌ను క్రియేట్ చేసి ఆర్జితసేవలు, వీఐపీ బ్రేక్ టికెట్లు అందుబాటులో ఉన్నాయని గ్రూప్‌లో పోస్ట్ చేస్తూ అందిన వరకు దోచుకుంటున్నాడని విజిలెన్స్ విచారణలో వెల్లడైంది. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని టీటీడీ విజిలెన్స్, పోలీసులను చైర్మన్ బీఆర్ నాయుడు ఆదేశించారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు





సోమవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని వస్తున్న కేంద్రమంత్రి శ్రీపాద యశోనాయక్, - కాశీ మఠాధిపతి సమ్యమేంద్రతీర్థ.







మద్రాసు హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వేలుమణి - ఇండియన్ నేవీ మాజీ అధికారి హరి ఓం సింగ్ రాణా - యాంకర్ గీతా భారతి

సెంటు భూమి కూడా అన్యాక్రాంతం కానివ్వం

● మోపూరు అటవీ భూముల్లో 144, 145 సెక్షన్లు ● ఆక్రమణదారులు రాకుండా పోలీసుల పహారా

డక్కిలి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలంలోని మోపూరు సర్వే నెంబరు 1లో ఉన్న అటవీశాఖ భూమి సెంటు కూడా అన్యాక్రాంతం కానివ్వబోమని వెంకటగిరి రేంజ్ ఆఫీసర్ లోకేశ్ స్పష్టం చేశారు. సోమవారం అటవీ భూముల ఆక్రమణ జరుగుతుందని సమాచారం అందడంతో ఆ శాఖ అధికారులతో పాటు పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించారు. సదరు భూముల్లోకి ఎవ్వరూ ప్రవేశించరాదంటూ పోలీసులు 144 సెక్షన్, అటవీశాఖ అధికారులు 145 సెక్షన్ విధించారు. ఈ సందర్భంగా రేంజర్ లోకేశ్ మాట్లాడుతూ గిరిజన సంఘ నాయకులు కొంతమంది స్థానికులను రెచ్చగొట్టి అటవీ భూముల ఆక్రమణను ప్రోత్సహించడం సరికాదన్నారు. రిజర్వు ఫారెస్టు భూములను ఆక్రమిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని గుర్తుచేశారు. కొంతమంది అటవీ భూమును తాము సాగు చేస్తున్నట్లు హైకోర్టును తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. 145 సెక్షన్ మూడు నెలలు పాటు అమల్లో ఉంటుందన్నారు. మోపూరు భూములను గూడూరు డీఎస్పీ గీతాకుమారి పరిశీలించారు. శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూడాలని చర్యలు తీసుకోవాలని వెంకటగిరి సీఐ వెంకటరమణకు తగు సూచనలు ఇచ్చారు.



మోపూరు భూముల్లో అటవీశాఖ, పోలీసు అధికారులు

పుత్తూరు వార్తలు

మున్సిపల్ బహిరంగ వేలంపై..
కన్నేసిన వైసీపీ పాలకవర్గం!

- ఏడాది పాటు లీజు ప్రాతిపదికన దినసరి మార్కెట్, జంతువధశాల, ప్రైవేట్ బస్టాండ్
- రూ.48.10 లక్షల పాత బకాయిలను పట్టించుకోని వైనం

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపల్ పరిధిలోని దినసరి మార్కెట్, జంతువధశాల, ప్రైవేటు బస్టాండ్‌ల నుంచి గుత్త వసూలు లీజు దక్కించుకునేందుకు అధికార వైసీపీ పాలకవర్గం కన్నేసింది. పోటీ లేకుండా లీజు దక్కించుకునే దిశగా చర్యలు చేపడుతున్నట్లు సమాచారం. గతంలో పాలకమండలి భరోసాతో డిపాజిట్ మొత్తం చెల్లించకుండా లీజు దక్కించుకుని గుత్త వసూలు చేసుకున్నారు. నేటికీ ఆ నిధులు మున్సిపాలిటీకి చెల్లించలేదు. ఈ అంశంపై రెండు పర్యాయాలు కౌన్సిల్ సమావేశంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు నిర్ణయం తీసుకున్నారు. కానీ, అమలుకు నోచుకోలేదు. గత కాంట్రాక్టర్ల నుంచి రూ.48.10 లక్షలు బకాయిలు వసూలు కావాల్సి ఉంది. కాగా, నేటి బహిరంగ వేలంలో బినామీ పేర్లతో లీజు దక్కించుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇప్పటి వరకు నలుగురు మాత్రమే లీజులో పాల్గొనేందుకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. గత ఏడాది దినసరి మార్కెట్ రూ.19.51 లక్షలతో దక్కించుకోగా ప్రైవేటు బస్టాండ్‌ను రూ.14.89 లక్షలు, జంతువధ శాలను రూ.4.87 లక్షలకు లీజుదార్లు దక్కించుకున్నారు. కాగా, ఈ ఏడాది లీజు మరింత ఎక్కువ ధర పలుకుతుందని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు.

లీజు బకాయిదారులు వీరే...

2021-22 జంతువధశాల లీజు నగదను నాగేంద్రబాబు రూ.2,15 లక్షలు, 2022-23కు గాను సునీల్ కుమార్ రూ.4.86 లక్షలు, 2023-24కు ఎస్.సుబ్రమణ్యం 5.42 లక్షలు చెల్లించాల్సి ఉండగా చెల్లించలేదు. ప్రైవేటు బస్టాండ్‌కు 2022-23కు చిరంజీవి రూ.9.73 లక్షలు బకాయి పడ్డాడు. దినసరి మార్కెట్‌కు 2023-24కు గాను జనార్ధన యాదవ్ రూ.25.92 లక్షలు చెల్లించాల్సి ఉంది. ఈ బకాయిలపై రూ.17.58 లక్షల వడ్డీ చెల్లింపులు చేయాల్సి ఉంది. బకాయి, వడ్డీతో కలిపి చెల్లించాల్సిన లీజు మొత్తం రూ.48.10 లక్షలుగా ఉంది.

నేడు బహిరంగ వేలం

పుత్తూరు మున్సిపల్ కార్యాలయంలో దినసరి మార్కెట్, జంతువధశాల, ప్రైవేటు బస్టాండ్ లీజుకు సంబంధించిన బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు కమిషనర్ మంజునాథ్ గౌడ్ పేర్కొన్నారు. దినసరి మార్కెట్‌కు రూ.20 లక్షల సాల్వెన్సీతో పాటు రూ.10 లక్షల డీడీ డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. ప్రైవేటు బస్టాండ్‌కు రూ.10 లక్షల సాల్వెన్సీతో పాటు రూ.6 లక్షలు డీడీ, జంతువధశాలకు రూ.3 లక్షల సాల్వెన్సీతో పాటు రూ.3 లక్షల డీడీ అందజేయాలని తెలియజేశారు. వేలం ముగిసే వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఈ లీజు కాలపరిమితి 2025 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2026 మార్చి 31వ తేదీ వరకు ఉంటుందన్నారు.

వేతనాలు పెంచండి: అంగన్‌వాడీలు

పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ పుత్తూరు ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ పుత్తూరు ప్రాజెక్టు కార్యాలయం వద్ద యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ తిరుపతి జిల్లా అధ్యక్షుడు జి.బాలసుబ్రమణ్యం, జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్ మాట్లాడుతూ... అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. హెల్పర్ల పదోన్నతుల్లో రాజకీయ జోక్యం ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో విజయకుమారి, రాధ, కృష్ణవేణి, నాగమల్లి, జయంతి, అరుణ, గంగులమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడి మృతి



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం పంగూరు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ ఉన్నం చెంచురామానాయుడు అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఈయన పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్నారు. పలువురు టీడీపీ నాయకులు, ప్రజలు ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు. మంగళవారం అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

దోమల నివారణ చర్యలు చేపట్టండి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పురపాలకసంఘ పరిధిలో దోమల నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలని బీజేపీ నాయకులు కోరారు. సోమవారం కమిషనర్ గిరికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో రోజురోజుకు దోమల బెడద ఎక్కువ అవుతోందన్నారు. ఇందుకు కారణంగా మందుల పిచికారీ, కాలువల్లో ఆయిల్ బాల్స్ వంటివి వేయకపోవడమే కారణమని చెప్పారు. హరీష్‌రెడ్డి, గరికపాటి రమేష్‌బాబు, డిల్లీకుమార్, రాజా, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

సురుటుపల్లె మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే ఆదిమూలానికి ఆహ్వానం



పిచ్చాటూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): నాగలాపురం మండలం సురుటుపల్లి పల్లికొండేశ్వర స్వామి ఆలయ మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే ఆదిమూలంకు ఆహ్వానం పలికారు. ఆలయ ఈవో లత, ప్రధాన అర్చకుడు కార్తికేయ గురుకుల్ సోమవారం పిచ్చాటూరులోని టీడీపీ కార్యాలయానికి చేరుకుని ఎమ్మెల్యేను ఆశీర్వదించి, బ్రహ్మోత్సవాలకు సాదరంగా ఆహ్వానించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాయమూర్తులకు ఆహ్వానం



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 17(ఆంధ్ర జ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 21 నుంచి మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం శ్రీకాళహస్తి 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్, సీనియర్ సివిల్ జడ్జి బేబీరాణి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కృష్ణప్రియను ఈవో బాపిరెడ్డి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సోలార్ ప్యానల్ లారీ బోల్తా

రేణిగుంట, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి సోలార్ ప్యానళ్లతో నంద్యాలకు వెళుతున్న కంటైనర్ లారీ బోల్తాపడింది.ఈ సంఘటన సోమవారం తెల్లవారు జామున గాజులమండ్యం పోలీసు స్టేషన్ సమీపంలోని హైవేలో జరిగింది. వేగంగా వెళుతున్న లారీ ముందు ఎనుములు పరిగెత్తుకుంటూ రోడ్డుదాటుతుండగా వాటిని తప్పించబోయి కంటైనర్ లారీ బోల్తా కొట్టింది. కంటైనర్ లారీ లోపల ఉన్న సోలార్ ప్యానళ్లు పగిలిపోయాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు అవగాహన

రేణిగుంట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రేణిగుంట రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు సంయుక్తంగా అవగాహన కల్పించారు. సోమవారం రాత్రి రైల్వే స్టేషన్‌లో వివిధ ప్రాంతాలకు వెళుతున్న ప్రయాణికులకు ఢిల్లీలో జరిగిన సంఘటనలపై అవగాహన కల్పించారు. అలాగే ప్రయాణికులు రైలులో ప్రయాణించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్పీఎఫ్, జీఆర్పీ ఇన్‌స్పెక్టర్లు సందీకుమార్, యతేంద్ర, జీఆర్పీ ఎస్ఐ రవి, ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసుల సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

జీబీఎస్ వైరస్‌పై ఆందోళన వద్దు

పెళ్లకూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జీబీఎస్(గులియన్ బారే సిండ్రోమ్) వ్యాధిపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పెళ్లకూరు పీహెచ్‌సీ వైద్యాధికారి సుజాతమ్మ అన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ జీబీఎస్ లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. జలుబు, జ్వరం, దగ్గు, విరోచనాలు, వాంతులు వచ్చినా, తిమ్మెర్లు, నరాలు, కండరాలు లాగినట్లు అనిపించినా ఆస్పత్రికి వెళ్లి వైద్యులను సంప్రదించాలని కోరారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం ఉదయం రైలు ఢీకొని గుర్తుతెలియని యువకుడు మృతి చెందాడు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, వయస్సు 25 సంవత్సరాలు ఉంటా యని రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తర లించారు. ప్రమాదశాత్తు మృతి చెందాడా, లేక ఆత్మహత్య చేసు కున్నాడా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

కారు ఢీకొని మోటారు సైక్లిస్టుకు గాయాలు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పండ్లూరు జాతీయ రహదారి సమీపంలో మోటారు సైకిల్‌ను కారు ఢీకొన్న సంఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. కలిపేడు గ్రామానికి చెందిన వెంకయ్య మోటారు సైకిల్‌పై నాయుడుపేట వైపు వెళ్తుండగా పండ్లూరు జంక్షన్ వద్ద చెన్నై వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకయ్యకు గాయాలవడంతో 108 వాహనంలో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు.

పరిసరాల శుభ్రతతో అంటువ్యాధులు దూరం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రతతోనే అంటువ్యాధుల నుంచి దూరంగా ఉండవచ్చని ప్రభుత్వాస్పత్రి వైద్యుడు డాక్టర్ రమేష్ అన్నారు. సోమవారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బందితో కలిసి ఆస్పత్రి పరిసరాల్లో చెత్తను తొలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ నివాస, ఉద్యోగ ప్రదేశ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆహ్లాదకరమైన, మనస్సుకు సానుకూలత వాతావరణం లభిస్తుందన్నారు. అంతకుముందు వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఆనంద్, సుధీర్, రజనీ తదితరులు పాల్గొన్నారు.




కాళంగి నదిని అనుకొని ఉన్న డంపింగ్ యార్డు - కుదిరి చెరువులో వ్యర్థాలు

కాళంగిని కాటేస్తున్న కాలుష్యం

- డంపింగ్ యార్డు నుంచి నదిలోకి వ్యర్థాలు
- కలుషితమవుతున్న నీరు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గంలో వేలాది ఎకరాలకు సాగు నీరందించే రైతుల వరప్రసాదిని కాళంగి నది కాలుష్య కోరల్లో చిక్కుకొంది. ఐదేళ్ల వైసీపీ పాలనలో అక్రమ ఇసుక తవ్వకాలతో కరిగిపోయి భూగర్భ జలాలు అడుగంటిన కాళంగిని నేడు కాలుష్యం కారణంగా నీరంతా కలుషితమై ప్రమాదంలో పడింది. తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల్లో రైతులు కాళంగి నీటిపై ఆధారపడి వేలాది ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. అలాగే వేసవిలో భూగర్భజలాలు అడుగంటినప్పుడు సూళ్లూరుపేట పట్టణ తాగునీటి అవసరాలను కాళంగి నది తీర్చుతోంది. దీనికి అనుసంధానంగా ఉన్న నెర్రికాలువ, పాముల కాలువ, పుచ్చాకాలువల గుండా దాదాపు 18 చెరువులకు సాగునీరు అందుతోంది. జిల్లాలోని కాళంగి నుంచి ప్రారంభమయ్యే నది బీఎన్ కండ్రిగ మండలం మీదుగా ప్రవహించి సూళ్లూరుపేట పట్టణ నడిబొడ్డున సాగుతూ తడ మండలం వాటంబేడు వద్ద ముగిస్తుంది. సూళ్లూరుపేట పట్టణంలోని హోలిక్రాస్ సమీపంలో కాళంగిని ఆనుకొని డంపింగ్ యార్డు ఉంది. పట్టణంలో వినియోగించే తడి, పొడి చెత్త వేలాది టన్నులు డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. ఈ చెత్తంతా నదిలోకి జారి నీరు కలుషితం అవుతోంది. సాగు, తాగునీటికి ఉపయోగించే కాళంగి నీరు రంగు మారిపోయి ప్రమాదకర స్థాయికి చేరింది. దీనికి తోడు వాటంబేడు వద్ద పులికాట్‌కు, కాళంగికి మధ్య ఉన్న గ్రాయిన్ దెబ్బతినడంతో భూగర్భ జలాలు ఉప్పుగా మారిపోతున్నాయి. దీంతో సాగునీరందక రైతులు లబోదిబోమంటున్నారు. డంపింగ్ యార్డును కాళంగి నది ప్రాంతం నుంచి తరలించాలని అనేకసార్లు విన్నవించుకొన్నా అధికారులు, ప్రజాప్రతినిధుల్లో చలనం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులకు స్పందించి కాళంగి నదిని కాలుష్య కోరల్లో నుంచి రక్షించాలని రైతులు, పట్టణ వాసులు కోరుతున్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి

గూడూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకుని, పాత చట్టాన్ని కొనసాగించాలని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఇన్సాఫ్ సమితి ఆధ్వర్యంలో ప్రజాసంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజులకాలంలో ముస్లింలకు దానం చేసిన ఆస్తులను వక్ఫ్ సవరణ చట్టంతో సొంతం చేసుకునేందుకు కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రయత్నాలు సాగిస్తోందన్నారు. మతాలకు అతీతంగా పాలన అందించాల్సిన పాలకులు మతవిద్వేషాలను రెచ్చగొట్టేలా వ్యవహరించడం దారుణమన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ రాఘువేంద్ర మీనాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాలేషా, నాశిన భాస్కర్ గౌడ్, మగ్దూం, జాహీద్, విజయ్ కుమార్, జమాలుల్లా, శశికుమార్, శివ కుమార్, ఎల్‌వీ సుబ్బయ్య, జిలానీబాషా, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

తాళాలు పగలగొట్టి చోరీ
9 సవర్ల బంగారం, రూ.55 వేల నగదు అపహరణ



ఇంట్లో చెల్లా చెదురుగా పడివున్న వస్తువులు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణం కుమ్మరివీధిలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. బాధితుల కథనం మేరకు... ఇంటి యజమాని పురుషోత్తం కుటుంబసభ్యులతో కలిసి శనివారం ఉదయం తిరుణ్ణామలై వెళ్లారు. దైవ దర్శనం అనంతరం ఆదివారం రాత్రి తిరిగి వస్తుండగా కుమ్మరివీధిలో స్థానికులు ఫోన్‌చేసి ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయని చెప్పడంతో పురుషోత్తం 100కు సమాచారం ఇచ్చాడు. వెంటనే పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని పరిశీలించగా తాళాలు పగలగొట్టి ఇంట్లో ఉన్న వస్తువులు, దుస్తులను చెల్లాచెదరుగా పడేసి ఉన్నాయి. ఇంటికి చేరుకున్న పురుషోత్తం 9 సవర్ల బంగారు ఆభర ణాలు, రూ.55వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

విశిష్ట గుర్తింపు సంఖ్యతో రైతులకు ఎన్నో లాభాలు

కోట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతూ విధిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి నిరంజన్ కుమార్ కోరారు. తహసీల్దారు కార్యాలయంలో సోమవారం సహాయ వ్యవసాయ అధికారులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో నిరంజన్‌కుమార్ మాట్లాడుతూ స్వంత భూమి కలిగిన రైతులందరికీ విశిష్ట గుర్తింపు సంఖ్యను ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించడం జరిగిందన్నారు. ఇందుకోసం ఆధార్ నెంబరు, పట్టాదారు పాస్ పుస్తకం, ఫోన్ నెంబరుతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. విశిష్ట గుర్తింపు సంఖ్య ఉంటేనే రైతులకు పంటల బీమా, పీఎం కిసాన్, పంట నష్ట పరిహారం, అన్నదాత సుఖీభవ, వ్యవసాయ యంత్ర పరికరాల రాయితీలు పొందవచ్చన్నారు. సమావేశంలో తహసీల్దారు జయజయరావు, ఆర్ఐ మధులత పాల్గొన్నారు.

ప్రతి అర్జీనీ పరిష్కరించాలి

కోట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గ్రీవెన్స్‌లో అందే ప్రతి అర్జీకి సంబంధిత అధికారులు పరిష్కారం చూపాలని తహసీల్దారు జయజయరావు అన్నారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో అన్నిశాఖల అధికారులతో గ్రీవెన్స్ నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. పలు సమస్యలపై శాఖల వారీగా అధికారులతో చర్చించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో వేణు, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

మహారాష్ట్ర, గోవా సీఎంలకు ఘనస్వాగతం



విమానాశ్రయంనుంచి వెళ్తున్న ఫడణవీస్, ప్రమోద్ సావంత్



రేణిగుంట, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఐటీసీఎక్స్‌లో పాల్గొనేందుకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకున్న మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్, గోవా సీఎం ప్రమోద్ సావంత్‌కు ఘన స్వాగతం లభించింది. ఇంటర్నేషనల్ టెంపుల్స్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పోలో పాల్గొనేందుకు సోమవారం ఉదయం ముంబై నుంచి ఫడణవీస్, గోవా నుంచి సావంత్ ప్రత్యేక విమానంలో తిరుపతి విమానాశ్రయం చేరుకున్నారు. వారికి కలెక్టర్ వెంకటేశ్వర్, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం వారు రోడ్డు మార్గాన తిరుమల బయలుదేరి వెళ్లారు.

జనసైనికుడి మరణం బాధాకరం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం బండారుపల్లికి చెందిన జనసేన క్రియాశీల సభ్యుడు ఎం.రాజేష్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట వినుత గ్రామానికి చేరుకుని రాజేష్ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. క్రియాశీల సభ్యత్వం ద్వారా రూ.5లక్షలు బీమా అందిస్తామని ఇద్దరు పిల్లల చదువు బాధ్యత తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కుదిరి గ్రామంలో రూ.8 లక్షలతో నిర్మించనున్న సిమెంటు రోడ్డు నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పల్లెల్లో ప్రతి వీధిలో సిమెంటు రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ గృహాలు మంజూరు చేస్తామన్నారు. అంతకుముందు ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు గురుకుల సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు గురుకల కృష్ణయ్య, పర్వత రెడ్డి చంద్రారెడ్డి, వేనాటి మురళీరెడ్డి, వై.సతీష్, హనుమంత శ్రీనివాసు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను విలీనం చేస్తే ఉద్యమిస్తాం



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న విద్యాకమిటీ చైర్మన్ సునీత, మాజీ ఎంపీటీసీ చెంగల్‌రావు

కోట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వావిళ్లదొరువు గ్రామంలో ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతులను కొత్తపట్నం పాఠశాలలో విలీనం చేసే ప్రయత్నాలు ఆపకపోతే ఉద్యమిస్తామని పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ సునీత, మాజీ ఎంపీటీసీ చెంగల్‌రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రెవెన్యూ, విద్యాశాఖ కార్యాలయాల ఎదుట గ్రామస్తులతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దారు జయజయరావు, ఎంఈవో మస్తానయ్యకు వినతిపత్రాలు అందజేశారు. వావిళ్లదొరువు ప్రాథమిక పాఠశాల తరగతులను కొత్తపట్నం పాఠశాలలోని విలీనం చేస్తే విద్యార్థులు ఒకటిన్నర కిలోమీటరు నడిచి వెళ్లాల్సి ఉంటుందన్నారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పాఠశాల విలీనాన్ని ఆపాలని కోరారు.

ఇసుక రీచ్‌లో స్థానికులకు పని కల్పించాలి



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న గూడలి గ్రామస్తులు

గూడూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కోట మండలం గూడలి గ్రామంలో ఉన్న ఇసుక రీచ్‌లో స్థానికులకు పని కల్పించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శశికుమార్ అన్నారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద గూడలి గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడలి సమీపంలోని ఇసుకరీచ్‌లో యంత్రాలతో పనులు చేయిస్తుండడంతో స్థానికులు ఉపాధి లేకుండా పోతుందన్నారు. స్థానికులకు పని కల్పించి జీవనోపాధిని మెరుగుపరచాలన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వెంకటయ్య, సుబ్రహ్మణ్యం, రవి, నాగయ్య, ప్రభావతి, గోవిందమ్మ పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ విశిష్ట గుర్తింపు సంఖ్య

వాకాడు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు పారదర్శకంగా సేవలను అందించేందుకు విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయించనున్నట్లు వ్యవసాయశాఖ అధికారిణి దీప తెలిపారు. సోమవారం వాకాడులోని రైతు భరోసా కేంద్రంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపడుతున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్ ద్వారా రైతు భూముల వివరాలను నమోదు చేసుకున్నాక 11అంకెలతో విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయించడం జరుగుతుందన్నారు. ఈసంఖ్య ఉంటేనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు, రాయితీలు, బీమా వంటి ప్రయోజనాలు పొందవచ్చన్నారు.

అంగన్‌వాడీ సిబ్బందికి శిక్షణ

ఓజిలి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బందికి సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్(సాల్ట్) కార్యక్రమంలో భాగంగా మంగళవారం నుంచి రెండు విడతల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంఈవో శైలజ తెలిపారు. జ్ఞానజ్యోతి సర్టిఫికెట్ కోర్సులో భాగంగా అంగన్‌వాడీల్లోని కిందస్థాయి సిబ్బందికి రాష్ట్ర పాఠశాల విద్య, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. మొదటి విడతగా మంగళవారం నుంచి 20వ తేదీ వరకు, రెండో విడత 21నుంచి 24వ తేదీ వరకు ఓజిలిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణ తరగతులు ఉంటాయన్నారు.

సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయండి



గూడూరు ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ సిబ్బంది నిరసన

గూడూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్ర జ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ సిబ్బంది చేపట్టిన 42రోజుల సమ్మె కాలంలో జరిగిన ఒప్పందాలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీఐటీయూ నాయకులు అన్నారు. సోమవారం గూడూరు ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సబ్‌కలెక్టర్ రాఘువేంద్ర మీనా, సీడీపీవో మెహబూబీలకు వినతిపత్రాలు అందజేశారు. యూనియన్ అధ్యక్షు రాలు ఇందిరమ్మ, కార్యదర్శి ప్రభావతి, మంగమ్మ, మణికుమారి, విజయలక్ష్మి, ప్రసన్న, వెంట్రామిరెడ్డి, శివకుమార్, బీవీ రమణయ్య, సురేష్, ప్రసాద్, చంద్రయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కోట: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు చెందిన అంగన్‌వాడీ వర్కర్లు తమ సమస్యలను పరిష్కరించాలంటూ నిరసన తెలిపారు. అక్కడ నుంచి కోట బజారు సెంటర్‌లో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ అసోసియేషన్ అధ్యక్షురాలు పద్మలీ తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట: పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి మునిరాజ, నాయకులు ముకుంద, శ్యామలమ్మ, కళావతి, పుష్పలత, దుర్గమ్మ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

సీఎంను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యేలు




సీఎం చంద్రబాబుకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల, పుష్పగుచ్ఛం అందజేస్తున్న విజయశ్రీ

సూళ్లూరుపేట, డక్కిలి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ టెంపుల్స్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో (ఐటీసీఎక్స్)లో పాల్గొనేందుకు సోమవారం మధ్యాహ్నం తిరుపతి విమానాశ్రయం చేరుకున్న సీఎం చంద్రబాబునాయుడిని సోమవారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

కొళాయి కోసం సిమెంటు రోడ్డు ధ్వంసం


హరహరబావివీధిలో రోడ్డును తవ్వేసి మట్టి పోసిన దృశ్యం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కొళాయి ఏర్పాటు కోసం సిమెంటు రోడ్డును పురపాలకసంఘ సిబ్బంది పగులగొట్టారు. ఆ తరువాత అక్కడ కనీసం ప్యాచ్ వేయకుండా మట్టి పోసి చేతులు దులుపుకున్నారు. పట్టణంలోని హరహర బావి వీధిలో చాలా చోట్ల సిమెంటు రోడ్డుపై గుంతలు పడ్డాయి. నెల రోజుల క్రితం ఈ వీధిలో ప్రభుత్వం పాత గుంతలన్నీ కాంక్రీట్‌తో బాగు చేశారు. అయితే వారం రోజుల క్రితం ఇదే వీధిలో ఓ ఇంటికి కొళాయి ఏర్పాటు కోసం పురపాలకసంఘ సిబ్బంది మళ్లీ 20 మీటర్ల పొడవున రోడ్డును తవ్వేశారు. సాధారణంగా కొళాయి ఏర్పాటు చేసిన తరువాత రోడ్డును సంబంధిత యజమాని చేత ప్యాచ్ వర్క్ చేయించాలి. ఇటు అధికారులు అటు యజమాని కానీ ఆ విషయాన్ని పట్టించుకోలేదు. ఈ తవ్విన రోడ్డు పక్కనే పురపాలక సంఘం పాఠశాల ఉంది. అలాగే ఈ మార్గంలో పలు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు రాకపోకలు సాగించాలి. సిమెంటు రోడ్డుపై మట్టికుప్ప ఉండటంతో రాత్రి వేళలో పిల్లలు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ


మహిళకు పర్సు అందజేస్తున్న ఏఎస్పీ తదితరులు

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ తన నిజాయితీని చాటుకున్నాడు. వరదయ్యపాళెం మండలానికి చెందిన మీర్జాన్‌బాషా ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పని నిమిత్తం తిరుపతికి వెళ్లాడు. ఈ క్రమంలో విమల అనే మహిళ సోమవారం తిరుపతి బస్టాండు నుంచి ఆటో ఎక్కి రామచంద్రాపురంలో దిగింది. అయితే ఆ మహిళ తన పర్సును ఆటోలో మరచి వెళ్లిపోయింది. పర్సులో రూ.8,500 ఉన్నట్లు గుర్తించాడు. ఈ విషయాన్ని ఆర్‌సీపురం పోలీసులకు తెలిపాడు. అందులోని ఆధార్‌కార్డులో వివరాల మేరకు మహిళ భర్తకు ఫోన్ చేశారు. అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి మహిళకు పర్సును అందజేశారు. మీర్జాన్‌బాషాను అభినందించారు.

220 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం



నాగలాపురం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): నాగలాపురం తూర్పు దళితవాడలో 220 బస్తాల రేషన్ బియ్యాన్ని ఎస్పీ పోలీసు ప్రత్యేక బృందం స్వాధీనం చేసుకుంది. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు ఎస్పీ అధికారి దాము ఆధ్వర్యంలో బృందం అక్రమ రేషన్ బియ్యం తరలింపుపై ప్రత్యేక నిఘా ఉంచింది. ఈ నేపథ్యంలో సోమవారం తెల్లవారు జామున 3గంటల ప్రాంతంలో నాగలాపురం తూర్పు దళితవాడలో బియ్యం లోడ్‌తో ఉన్న లారీని పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న 220 బస్తాల బియ్యం విలువ రూ.3లక్షలు పైగా ఉంటుందని సమాచారం. ఈ అక్రమ రవాణా దందాలో ఏపీఎస్పీకి చెందిన కానిస్టేబుల్ కనుసన్నల్లో జరుగుతున్నట్లు సమాచారం

మేతబీడులో గ్రావెల్ తవ్వకాలు?


గ్రావెల్‌ను తరలించేందుకు సిద్ధంగా ఉన్న టిప్పర్లు

సత్యవేడు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో రాష్ట్ర సరనిహద్దులో ఉన్న మదనంజేరి పంచాయతీ తుండుకుళి గ్రామ సర్వే నెం. 180లోని మేతబీడు భూమిలో చేపట్టిన గ్రావెల్‌ను తవ్వకాలను ఆపాలని గ్రామస్తులు కోరుతున్నారు. సదరు భూమిలో గత రెండు రోజులుగా చెన్నైకు చెందిన కొందరు రోజుకు రెండు, మూడు హిటాచి ఎక్స్‌కవేటర్ల సాయంతో గ్రావెల్‌ను తవ్వి, 30-40 టిప్పర్లలో తరలిస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి తుండుకుళి మేత బీడు భూమిలో జరుగుతున్న గ్రావెల్ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చంద్రబాబును కలిసిన రామ్‌ప్రకాష్ యాదవ్



నాగలాపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ ఆలయాల సదస్సులో పాల్గొనేందుకు సోమవారం తిరుపతికి వచ్చిన సీఎం చంద్రబాబును నాగలాపురానికి చెందిన తిరుపతి పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు ఆవుల రామ్‌ప్రకాష్ యాదవ్ తిరుపతి ఎయిర్ పోర్ట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్ళినట్లు రామ్‌ప్రకాష్ తెలిపారు.

పూరిల్లు దగ్ధం



పిచ్చాటూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీసీ బాలికల సంక్షేమ హాస్టల్ సమీపంలో ఉన్న పూరిల్లు దగ్ధమైంది. సమాచారం అందుకున్న వీఆర్‌వో ప్రియాంక, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు అందించి ఇంటి యజమానులు ఈ ఇల్లు కుప్పయ్య, ఇంద్ర దంపతులకు ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

హామీలు విస్మరించొద్దు : అంగన్‌వాడీలు

పిచ్చాటూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు అంగన్‌వాడీలకు కూటమి నేతలు ఇచ్చిన హామీలను విస్మరించొద్దని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ యూనియన్ నాయకులు, కార్యకర్తలు సీఐటీయూ నాయకులతో కలసి సోమవారం సీడీపీవో కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు గ్రాడ్యుటీ అమలు చేయాలని, మినీసెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చి మారుస్తూ వర్కర్లకు పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. నాగరాజు, రామచంద్రారెడ్డి, రాజేశ్వరి, ఇంద్రాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ బహిరంగ సభ

పిచ్చాటూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): సామాజిక తనిఖీ బహిరంగ సభ ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 18న మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మహ్మద్ రఫి చెప్పారు. ఉపాధి హామీ పథకానికి సంబంధించి 18వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సభలో ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు జరిగిన పనులపై పంచాయతీరాజ్, హౌసింగ్, అటవీశాఖ, క్రాంతి పథం, సమగ్ర శిక్ష అభియాన్ తదితర శాఖలో జరిగిన పనులపై గత నెల 23నుంచి ఫిబ్రవరి 7వ తేదీ వరకు తనిఖీలు జరిగాయి. వీటిపై గ్రామసభలో చర్చించనున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

మండల సమస్యలను పరిష్కరించండి

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని తిరుపతి కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు బీజేపీ మండల అధ్యక్షుడు డిల్లీ ప్రకాష్ విన్నవించారు. సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఆయన అధికారులను కలిశారు. ఆయన మాట్లాడుతూ సాతంబేడులో పెండింగ్‌లో ఉన్న రోడ్డును నిర్మించాలని, వరదయ్యపాళం మీదుగా అధిక బరువుతో వాహనాలు ఎక్కువగా వెళ్లడం కారణంగా రోడ్డు దెబ్బతింటోందన్నారు. ఇందిరానగర్‌లో రెవెన్యూ భూములను గ్రామనత్తం కింద నమోదు చేయాలని, ఇల్లు కట్టుకోవడానికి పొజిషన్ పట్టాలు అందజేయాలన్నారు. రెవన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని కోరారు. భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా మహాశివరాత్రి ఏర్పాట్లు




శివరాత్రి ఉత్సవాల కోసం పరిసరాలను చదును చేస్తున్న యంత్రం - భక్తుల కోసం ఏర్పాటు చేసిన పందిరి - సాంస్కృతిక కార్యక్రమాల కోసం సిద్ధమవుతున్న ధూర్జటి కళావేదిక

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాల కోసం ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈనెల 21న భక్త కన్నప్ప ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమై మార్చి 6వ తేదీ వరకు కొనసాగనున్న విషయం విదితమే. మూడు రోజులు మాత్రమే సమయం మిగిలి ఉండటంతో ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఉత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ఇప్పటికే పలుమార్లు అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. 14 రోజుల పాటు జరిగే సాం స్కృతిక కార్యక్రమాల కోసం ధూర్జటి కళా ప్రాంగణం ముస్తాబవుతోంది. ఇక భక్తులు సేద తీరేందుకు చలువ పందిళ్లను, విడిది కేంద్రాలు సిద్ధం చేస్తున్నారు.

సీఎంకు ఘన స్వాగతం


సీఎంకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యేలు ఆదిమూలం, సుధీర్ - జనసేన నాయకురాలు వినుత, బీజేపీ నేత ఆనంద్

రేణిగుంట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ టెంపుల్స్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో(ఐటీసీఎక్స్)లో పాల్గొనేందుకు సోమవారం మధ్యాహ్నం 3.53గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న సీఎం చంద్రబాబు కు సాదర స్వాగతం లభించింది. రెవెన్యూ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, చంద్రగిరి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, సత్యవేడు, వెంకటగిరి, నగరి, పూతలపట్టు, గంగాధర నెల్లూరు ఎమ్మెల్యేలు పులివర్తి నాని, బొజ్జల సుధీర్‌రెడ్డి, నెలవల విజయశ్రీ, కోనేటి ఆదిమూలం, కురుగొండ్ల రామకృష్ణ, గాలి భానుప్రకాష్, మురళీమోహన్, డాక్టర్ వి.ఎం.థామస్, శాప్ చైర్మన్ రవినాయుడు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తిరుపతి డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, టీడీపీ నాయకుడు శ్రీధర్‌వర్మ, జనసేన జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, టీటీడీ ఈవో శ్యామలరావు, అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరి, డీఐజీ సిమోషీ బాజ్‌పాయ్, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జేసీ శుభం బన్సల్, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

సీఎంలకు సాదర వీడ్కోలు

ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గోవా రాష్ట్రాల సీఎంలకు అధికారులు, ప్రజాప్రతినిధులు సాదర వీడ్కోలు పలికారు. సోమవారం తిరపతిలో జరిగిన కార్యక్రమానికి హాజరైన సీఎంలు చంద్రబాబు, దేవేంద్ర ఫడణవీస్, ప్రమోద్ సావంత్ కార్యక్రమం ముగించుకుని రోడ్డు మార్గాన విమానాశ్రయం చేరుకున్నారు. వారికి కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు వీడ్కోలు పలుకగా ముగ్గురు సీఎంలు ప్రత్యేక విమానంలో విజయవాడ, ముంబై, గోవాకు వెళ్లారు.

సీఎంకు గుడిమల్లం ఉత్సవాల ఆహ్వానపత్రిక



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): తిరుపతి పర్యటన నిమిత్తం సోమవారం సీఎం చంద్రబాబు తిరుపతి విమానాశ్రయానికి చేరుకున్నారు. విమానాశ్రయంలో సీఎంను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్ మర్యాదపూర్వకంగా కలిసి గుడిమల్లం పరశురామేశ్వరుడి మహాశివరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. అదే విధంగా తీర్థప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో గుడిమల్లం ఆలయ మాజీ చైర్మన్ గిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.



ప్రాణమున్నంత వరకు ప్రజా సేవ: ఆదిమూలం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

కేవీబీపురం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రాణం ఉన్నంత వరకు ప్రజా సేవ చేస్తానని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. సోమవారం కేవీబీపురం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన ఉపాధిహామీ పనులు, ఎన్టీఆర్ పక్కాగృహాలు, సిమెంటు రోడ్ల నిర్మాణాలు ఏ దశలో ఉన్నాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ ఏఈని ఇప్పటి వరకు ఎన్ని సిమెంటు రోడ్లు పూర్తి చేశారని అడిగారు. ఆ జాబితా ఏఈ వద్ద లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఎంపీడీవో రాధారాణికి సూచించారు. స్థలాలు లేనివారికి ఇవ్వాలని తహసీల్దారు మునిరత్నంను కోరారు. అనంతరం రాయపేడు, కేవీబీపురంలో సిమెంటు రోడ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. టీడీపీ నాయకులు మల్లికార్జునరెడ్డి, కిషోర్‌రెడ్డి, సర్పంచు బాలాజీ, మాజీ ఎంపీపీ మణి, డాక్టర్ రమేష్, విజయనాయుడు, కేశవులు నాయుడు, బీజేపీ మండల అధ్యక్షుడు బాబుయాదవ్, జనసేన మండల అధ్యక్షుడు థామస్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నపాలేడు గ్రామస్తులు పర్యావరణం పరిరక్షణకు నడుంబిగించారు. మండల స్థాయి అధికారుల సమక్షంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విశ్రాంత ఎస్పీ రమేష్‌నాయుడు మాట్లాడుతూ... దామానెల్లూరు రోడ్డు నుంచి గ్రామం వరకు సుమారు రూ.3లక్షల విలువైన మొక్కలు నాటామన్నారు. మొక్కల సంరక్షణ గ్రామస్తుల బాధ్యత అన్నారు. ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు, ఎంఈవో రవీంద్రనాథ్, ఏఈ చలపతి, ఏవో భారతి, సర్పంచు రత్నమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

తాగునీటి దుర్వినియోగంపై ఫిర్యాదు

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేణుగోపాలపురం పంచాయతీ సేలం గ్రామంలోని తాగునీటిని సమీపంలో ఉన్న క్రషర్ యాజమాన్యం పైపులైను వేసుకుని తరలిస్తోందంటూ గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ సుబ్రహ్మణ్యంకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో 50 కుటుంబాలు వారికి ప్రభుత్వ బోరు నుంచి తాగు నీరు అందుతోందన్నారు. గ్రామానికి సమీపంలో ఉన్న క్రషర్ యాజయాన్యం అధికారుల అనుమతి తీసుకోకుండా పైపులైను వేసుకున్నారని చెప్పారు. స్పందించిన తహసీల్దార్ విచారణ చేపట్టి న్యాయం చేస్తామని గ్రామస్తులకు చెప్పారు.

28లోగా రైతు గుర్తింపు సంఖ్య నమోదు

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు ఈనెల 28లోగా గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి భారతి తెలిపారు. మండలంలోని కనమనంబేడు, ఆర్.అనంతపురం, చిన్నపాలేడు గ్రామాల్లో వ్యవసాయ శాఖాధికారులు సోమవారం గ్రామ సభల ద్వారా రైతు గుర్తింపు సంఖ్య కోసం ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడు తూ... రైతులు ఆధార్ కార్డుకు అనుసంధా నమైన ఫోన్ నెంబరు, పట్టాదార్ పాసు పుస్తకం తీసుకుని రైతు సేవా కేంద్రంలో వీఏఏ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలన్నారు.

మృత్యుంజయుడికి పూజలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మృత్యుంజయస్వామికి సోమవారాన్ని పురస్కరించుకుని ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంతో అభిషేకించారు. అనంతరం వివిధ గజమాల, వెండి నాగాభరణంతో స్వామివారిని అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

టెన్నిస్ టోర్నీ ప్రారంభం


టెన్నిస్ ఆడుతున్న ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విక్రమ్ టెన్నిస్ అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం సీనియర్ నేషనల్ టెన్నిస్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే సుధీర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... విక్రమ్ టెన్నిస్ అకాడమీ జాతీయ స్థాయి టోర్నీ నిర్వహించడం సంతోషకరమన్నారు. శ్రీకాళహస్తి పరసర ప్రాంతాల్లో టెన్నిస్‌ను ప్రోత్సహిస్తున్నారన్నారు. అనంతరం కాసేపు సరదగా టెన్నిస్ ఆడారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ చంద్రశేఖర్, మునిలక్ష్మి, టీడీపీ నాయకుడు చెంచయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిపై విద్యార్థులకు అవగాహన


సూచనలిస్తున్న ఏరియా ఆస్పత్రి వైద్యురాలు విజయలక్ష్మి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం ఐక్యూఏసీ, శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ మెంటల్ హెల్త్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మెంటల్ హెల్త్ మోడల్ ఆఫీసర్ యాసిన్ మాట్లాడుతూ విద్యార్థులు సహజంగా ఎదుర్కొనే ఒత్తిడి, వాటి కారణాలను, నివారణ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఒత్తిడికి గురైన వారు టోల్‌ఫ్రీ నెం.14416 సేవలను వినియోగించుకోవచ్చన్నారు. ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మి, వైస్‌ప్రిన్సిపాల్ దీనదయాల్ పాల్గొన్నారు.

గైడ్ కెప్టెన్ శిక్షణ ప్రారంభం


శిక్షణ ఇస్తున్న నిర్వాహకులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సరస్వతి బాయి పుర పాలకసంఘ ఉన్నత పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ తిరుపతి జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో గైడ్ కెప్టెన్ బేసిక్ శిక్షణ ప్రారంభమైంది. డీఈవో కే.వీ.ఎన్ కుమార్ ఆదేశాల మేరకు 23వ తేదీ వరకు ఈ శిక్షణ నిర్వహించనున్నారు. జిల్లావ్యాప్తంగా 42మంది మహిళా ఉపాధ్యాయులు, పీఈటీలు పాల్గొన్నారు. శిక్షకులుగా శకుంతలమ్మ, జిల్లా కార్యదర్శి జయరామ్, జిల్లా కార్యాలయ కమిషనర్ రమేష్‌బాబు, కోటేశ్వరరావు, సతీసావిత్రి, పార్వతి, అజారుద్దీన్, హేమకుమార్ పాల్గొన్నారు.